




# శివసూర్య

RNI APTEL : 2023/88704

తెలుగు దిన పత్రిక









కర్నూలు సంపుటి : 03, సంచిక : 323 చీఫ్ ఎడిటర్.. పేజిలు : 08, వెల రూ. 2రూ/శనివారం -01 - ఆగస్టు - 2026

Published From Kurnool : Circulated at Srikakulam,VishakaPatanam,Vijayanagaram, East Godavari, West Godavari, Krishna, Guntur, Prakasam, Nellore, Chittoor,, Kadapa,

2లో

### ఏపీలో 'సర్' ముసాయిదా ఓటరు జాబితా విడుదల..

- 3.71 కోట్ల మంది ఓటర్లు తమ ఎన్యూమరేషన్ ఫారాలు సమర్పించారు
- మొత్తం 4.16 కోట్ల ఓటర్లలో 89.22 శాతం మంది ఫారాలు ఇచ్చారు
- 15.22 లక్షల మందిని మృతులుగా గుర్తించారు
- 22.30 లక్షల మంది శాశ్వతంగా మారినట్లు లేదా గైర్హాజరైనట్లు నిర్ధరించారు
- 7.37 లక్షల మంది పేర్లు రెండు, మూడు చోట్ల నమోదైనట్లు తేల్చారు.

## సూపర్ ఎల్ నినో సమయంలో

# ప్రతి నీటి బొట్టు విలువైనదే....

### పవన్ తో సమావేశమైన నిమ్మల రామానాయుడు

- రాష్ట్రంలోని సాగునీటి పరిస్థితులపై చర్చించిన నేతలు
- నీటి ఎద్దడిపై రైతుల్లో అవగాహన కల్పించాలన్న పవన్
- నీటి ఎద్దడిపై రైతుల్లో అవగాహన కల్పించడంతో పాటు, ప్రత్యామ్నాయ సాగు మార్గాలపై దృష్టి సారించాలి
- రైతుల ఆందోళనను తగ్గించేందుకు అధికారులతో పాటు ప్రజాప్రతినిధులు కూడా బాధ్యత తీసుకోవాలి



అమరావతి: రాష్ట్రంలో సూపర్ ఎల్‌నినో ప్రభావం వల్ల నెలకొన్న సాగునీటి కొరతపై ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతి నీటి బొట్టు ఎంతో అమూల్యమైనదని, కాలువల్లో పూడిక తీత, గట్ల లీకేజీల నివారణ వంటి తక్షణ చర్యల ద్వారా మిగతా 2 లో

### ఇరాన్ ఎయిర్‌లైన్స్‌కు మద్దతిస్తున్న భారత కంపెనీపై అమెరికా ఆంక్షలు



2లో

- భారత్‌తో పాటు చైనా, రష్యాకు చెందిన ఆరు సంస్థలపై చర్యలు
- ఉగ్ర సంస్థ ఐఆర్‌జీసీకి మహాన్ ఎయిర్ సాయం చేస్తోందన్న యూఎస్
- 2020 నుంచి మహాన్ ఎయిర్‌కు ఏజెంట్‌గా స్కైజ్ ట్రావెల్స్



### టేకాఫ్‌కు ఉత్తరాంధ్ర సిద్ధం.. మోదీజీ మీ రాకకోసం ఎదురుచూస్తున్నాం: చంద్రబాబు

- "నేడు భోగాపురంలో అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ప్రారంభించనున్నాం
- ఇది దేశ మౌలిక సదుపాయాల అభివృద్ధిలో మరో కీలక మైలురాయి"
- ప్రధాని పోస్ట్‌ను సీఎం చంద్రబాబు షేర్ చేశారు
- "ఉత్తరాంధ్ర టేకాఫ్‌కు సిద్ధంగా ఉంది. మోదీజీ.. మీ రాక కోసం ఎదురు చూస్తున్నాం"

2లో

### మోదీకి ఇస్లామాబాద్ నుంచి ఆహ్వానం? పాకిస్థాన్ సంకేతాలు..!

2027 ఎస్‌సీఓ సదస్సుకు మోదీకి ఆహ్వానం పంపనున్నట్లు సంకేతం

ఎస్‌సీఓ నిబంధనల ప్రకారమే ఆహ్వానమన్న ఆ దేశ విదేశాంగ శాఖ



2లో

సభ్య దేశాలన్నింటికీ ఆహ్వానాలు పంపనున్న పాక్

- జైశంకర్-పాక్ మంత్రి భేటీపై స్పష్టత
- 2027 సదస్సుకు ఇస్లామాబాద్ ఆతిథ్యం
- ఎస్‌సీఓలో మొత్తం 10 సభ్య దేశాలు

### భారత్‌పై ట్రంప్ ప్రభుత్వ ప్రత్యేక దృష్టి..




2లో

కొత్త దౌత్య వ్యూహం సిద్ధం

- ట్రంప్ కొత్త వ్యూహంలో భారత్‌కు ప్రాధాన్యం
- ఆసియాపై దృష్టి పెంచనున్న అమెరికా
- చైనా ప్రచారాన్ని ఎదుర్కోవడమే లక్ష్యం
- డిజిటల్ వేదికలకు అధిక ప్రాధాన్యం
- షార్ట్ వీడియోలు, పోడ్‌కాస్ట్‌లపై ఫోకస్

# మోదీ చేసిన అప్పు రూ.151 లక్షల కోట్లు

### పనితీరు కనబరిచినందుకు రాజీనామా చేయాలా?

- ★ విద్యాశాఖ మంత్రిగా రేవంత్ వైదొలగాలని కొందరు అంటున్నారు
- ★ నర్సరీ నుంచి 12వ తరగతి వరకు బ్రేక్‌ఫాస్ట్ ఇస్తున్నందుకా?
- ★ టీచర్ల నియామకం, పదోన్నతులు సక్రమంగా నిర్వహించినందుకా?
- ★ ఫిన్‌లాండ్, జర్మనీలో పర్యటించిన టీచర్లతో ముఖాముఖిలో సీఎం రేవంత్‌రెడ్డి
- ★ 2034 వరకు ప్రజా ప్రభుత్వమే అధికారంలో ఉంటుందని వెల్లడి




హైదరాబాద్: స్వాతంత్ర్యం వచ్చిన నాటినుంచి 2014 వరకు ప్రధానులుగా ఉన్నవాళ్లు చేసిన మొత్తం అప్పు రూ.50 లక్షల కోట్లు అని సీఎం రేవంత్ అన్నారు. 2014 నుంచి 2026 వరకు ప్రధాని మోదీ చేసిన అప్పు రూ.151 లక్షల కోట్లు అని చెప్పారు. ఇప్పటి వరకు దేశంపై ఉన్న మిగతా 2 లో

## భోగాపురం నుంచి రూ.17,900 కోట్ల

# ప్రాజెక్టులకు శ్రీకారం

- భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ప్రారంభించనున్న ప్రధాని
- నేడు మోదీ చేతుల మీదుగా భోగాపురం ఎయిర్ పోర్ట్ ప్రారంభోత్సవం... పీఎంఓ అధికారిక ప్రకటన విడుదల
- ఆగస్టు 1న ఏపీ, కర్ణాటక రాష్ట్రాల్లో ప్రధాని నరేంద్ర మోదీ పర్యటన
- విశాఖలో సెమీకండక్టర్ ప్లాంట్‌తో పాటు పలు విద్యుత్, జాతీయ రహదారుల ప్రాజెక్టులకు శంకుస్థాపన
- ఏపీ పర్యటన అనంతరం కర్ణాటకకు పయనం




అమరావతి/హైదరాబాద్: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేడు (ఆగస్టు 1) ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లో పర్యటించనున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఏపీలో సుమారు రూ.17,900 కోట్లకు పైగా విలువైన పలు కీలక అభివృద్ధి ప్రాజెక్టులకు మిగతా 2 లో



### పోరాటాలను అక్రమ కేసులు ఆపలేవు

### నాంపల్లి కోర్టుకు హాజరైన కేటీఆర్

- ఫార్ములా-ఈ రేసు కేసుకు సంబంధించి కోర్టు విచారణకు హాజరైన కేటీఆర్
- తదుపరి విచారణకు ఆగస్టు 25కి వాయిదా వేసిన కోర్టు
- పెద్ది సుదర్శన్ రెడ్డి అంత్యక్రియల్లో పాల్గొనేందుకు బయల్దేరిన కేటీఆర్

హైదరాబాద్: "ప్రజల తరఫున మేం చేసే పోరాటాలను మిగతా 2 లో



2లో

### రేషన్ కార్డుదారులకు ఊరట.. ఈ-కేవైసీ గడువు పెంపు

- రేషన్ ఈ-కేవైసీ గడువు ఆగస్టు 31 వరకు పొడిగింపు
- రాష్ట్రవ్యాప్తంగా కొత్త గడువు అమలు
- భారీ వర్షాల నేపథ్యంలో ప్రభుత్వ నిర్ణయం
- ఈ-కేవైసీ లేకున్నా మూడు నెలల రేషన్ పంపిణీ
- శనివారం నుంచి ఒకేసారి సరకుల పంపిణీ
- సమీప రేషన్ దుకాణంలో ఈ-కేవైసీ పూర్తి చేసుకునే అవకాశం

# పేపర్ లీక్‌లపై కేంద్రం ఉక్కుపాదం..

### రాజ్యసభలోనూ ఆమోదం పొందిన బిల్లు

- రాష్ట్రపతి ఆమోదం లభించిన వెంటనే అమల్లోకి చట్టం
- గరిష్ఠంగా రూ.10 కోట్ల జరిమానా
- జైలు శిక్ష, ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల ద్వారా విచారణ
- ఎన్‌టీఏపై ప్రతిపక్షం విమర్శలు
- సమగ్ర సంస్కరణలపై కొనసాగుతున్న డిమాండ్



ఢిల్లీ: దేశవ్యాప్తంగా పరీక్షల నిర్వహణలో పారదర్శకత పెంచడం, పేపర్ లీక్‌లను అరికట్టడం లక్ష్యంగా తీసుకొచ్చిన మిగతా 2 లో



2లో

### కర్ణాటకకు రావొద్దు.. తమిళనాడు సీఎం విజయ్‌కు డీకే శివకుమార్ సూచన

- కావేరి ఉద్రిక్తతల పర్యటన సరికాదని సూచన
- అఖిలపక్ష సమావేశం తర్వాత కొత్త తేదీ
- వర్షాలతో పరిస్థితులు మెరుగుపడతాయని డీకేఎస్ ఆశాభావం
- మేకెదాటు ప్రాజెక్టు తమిళనాడుకూ ఉపయోగకరమన్న శివకుమార్
- సుప్రీంకోర్టు తీర్పుకు కట్టుబడతామని స్పష్టీకరణ

## మోదీకి ఇస్లామాబాద్ నుంచి ఆహ్వానం? పాకిస్థాన్ సంకేతాలు..!

ఢిల్లీ: 2027లో ఇస్లామాబాద్‌లో జరగనున్న షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీఓ) సదస్సుకు ప్రధాని నరేంద్ర మోదీని ఆహ్వానిస్తామని పాకిస్థాన్ సంకేతాలు ఇచ్చింది. ఎస్‌సీఓ నిబంధనల ప్రకారం సభ్య దేశాల అధినేతలందరికీ ఆహ్వానాలు పంపడం ఆతిథ్య దేశం బాధ్యత అని పాకిస్థాన్ విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి తెలిపారు. ఆ ప్రక్రియలో భాగంగానే భారత్‌కూ ఆహ్వానం అందుతుందని స్పష్టం చేశారు. ఇస్లామాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఈ విషయాన్ని వెల్లడించారు. ఎస్‌సీఓలో సభ్య దేశమైన భారత్‌కు కూడా మిగతా దేశాల మాదిరిగానే అధికారిక ఆహ్వానం పంపుతామని చెప్పారు. ఇది ఎలాంటి ప్రత్యేక నిర్ణయం కాదని, సంస్థ అమలు చేస్తున్న విధానంలో భాగమేనని వివరించారు. మరోవైపు ఫిలిప్పీన్స్‌లో జరుగుతున్న ఆసియాన్ సమావేశాల సందర్భంగా భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్, పాకిస్థాన్ విదేశాంగ మంత్రి మధ్య భేటీ జరగనున్నట్లు వస్తున్న వార్తలపై కూడా స్పందించారు. అలాంటి సమావేశం కోసం భారత్ నుంచి ఎలాంటి అభ్యర్థన తమకు అందలేదని పాకిస్థాన్ తెలిపింది. ఎస్‌సీఓలో అధ్యక్ష బాధ్యతల మార్పిడి విధానంలో భాగంగా 2027 సదస్సుకు పాకిస్థాన్ ఆతిథ్యం ఇవ్వనుంది. చైనా, రష్యా, భారత్, పాకిస్థాన్‌తో పాటు మొత్తం 10 దేశాలు ఈ సంస్థలో సభ్యులుగా ఉన్నాయి. యురేషియా ప్రాంతంలో శాంతి, భద్రత, ఆర్థిక సహకారాన్ని పెంపొందించడమే ఈ సంస్థ ప్రధాన లక్ష్యం.

## భారత్‌పై ట్రంప్ ప్రభుత్వ ప్రత్యేక దృష్టి..
### కొత్త దౌత్య వ్యూహం సిద్ధం

ఢిల్లీ: ట్రంప్ ప్రభుత్వ కొత్త ప్రజా దౌత్య వ్యూహంలో భారత్‌కు కీలక స్థానం దక్కింది. ఆసియాపై మరింత దృష్టి సారిస్తూ విదేశాల్లో సమాచార వ్యాప్తి విధానాన్ని మార్చేందుకు అమెరికా సిద్ధమవుతోంది. ఈ క్రమంలో భారత్, జపాన్ వంటి దేశాలకు ప్రాధాన్యం పెంచనున్నట్లు అమెరికా గ్లోబల్ మీడియా ఏజెన్సీ (యూఎస్ఏజీఎం) డైరెక్టర్ పదవికి నామినేట్ అయిన సారా రోజర్స్ వెల్లడించారు. అమెరికా సెనేట్ విదేశాంగ వ్యవహారాల కమిటీ ముందు మాట్లాడిన రోజర్స్.. ఆసియా తమ ప్రాధాన్య ప్రాంతాల్లో ఒకటిగా ఉంటుందని చెప్పారు. చైనా, ఇతర నిరంకుశ దేశాల దుష్ప్రచారాన్ని సమర్థంగా ఎదుర్కొనేందుకు కొత్త వ్యూహం అవసరమని అభిప్రాయపడ్డారు. వాయిస్ ఆఫ్ అమెరికా, రేడియో ఫ్రీ ఆసియా, రేడియో ఫ్రీ యూరప్ వంటి అంతర్జాతీయ ప్రసార సంస్థలను యూఎస్ఏజీఎం నిర్వహిస్తోంది. భారత్, జపాన్‌లో సోషల్ మీడియా ప్రభావం ఎక్కువగా ఉన్నందున ఆ దేశాలపై తాను ఎక్కువగా దృష్టి పెట్టినట్లు రోజర్స్ తెలిపారు. ఈ దేశాలకు సంబంధించిన పోస్టులను సోషల్ మీడియాలో విస్తృతంగా షేర్ చేసినట్లు చెప్పారు. సంప్రదాయ రేడియో, టెలివిజన్‌కే పరిమితం కాకుండా ప్రజలు ఎక్కువగా ఉపయోగించే డిజిటల్ వేదికలపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. భవిష్యత్తులో షార్ట్ వీడియోలు, పాడ్‌కాస్ట్‌లు, ప్రవాస భారతీయుల గ్రూప్ చాట్‌లు కూడా సమాచార వ్యాప్తిలో కీలక పాత్ర పోషిస్తాయని రోజర్స్ పేర్కొన్నారు. స్వతంత్ర సమాచారం అందుబాటులో లేని దేశాలపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తామని చెప్పారు. చైనాతో వాణిజ్యం, సాంకేతిక రంగం, రక్షణతో పాటు సమాచార రంగంలోనూ పోటీ పెరుగుతున్న వేళ ఈ మార్పులు చోటుచేసుకోవడం ప్రాధాన్యం సంతరించుకుంది.

## ఇరాన్ ఎయిర్‌లైన్స్‌కు మద్దతిస్తున్న
## భారత కంపెనీపై అమెరికా ఆంక్షలు

ఢిల్లీ: ఇరాన్‌కు చెందిన మహాన్ ఎయిర్ విమానయాన సంస్థకు సహకారం అందిస్తున్నాయన్న ఆరోపణలపై అమెరికా కఠిన చర్యలు చేపట్టింది. భారత్‌కు చెందిన ఒక సంస్థతో పాటు మొత్తం ఆరు సంస్థలు, వ్యక్తులపై గురువారం ఆంక్షలు విధించింది. ఈ సంస్థలన్నీ ఇరాన్‌కు చెందిన ఇస్లామిక్ రెవెల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్‌జీసీ)కు పరోక్షంగా మద్దతిస్తున్నాయని అమెరికా ట్రెజరీ విభాగం ఆరోపించింది. ఆంక్షలకు గురైన సంస్థలు మహాన్ ఎయిర్‌కు జనరల్ సేల్స్ ఏజెంట్లుగా (జీఎస్ఏ) పనిచేస్తున్నాయని అమెరికా తెలిపింది. మహాన్ ఎయిర్ చాలాకాలంగా ఐఆర్‌జీసీకి సిబ్బంది, ఆయుధాలు, డ్రోన్ వ్యవస్థలను రవాణా చేస్తూ సాయపడుతోందని వాషింగ్టన్ పేర్కొంది. "ఐఆర్‌జీసీకి లేదా మహాన్ ఎయిర్‌కు ఆర్థిక, లాజిస్టిక్స్, వాణిజ్య మద్దతు ఇచ్చేవారు ఒక ఉగ్రవాద సంస్థ మనుగడకు సాయపడుతున్నట్లే" అని అమెరికా ట్రెజరీ సెక్రటరీ స్కాట్ బెస్సెంట్ ఒక ప్రకటనలో తెలిపారు. అలాంటి వారిని గుర్తించి, వారిని అమెరికా ఆర్థిక వ్యవస్థ నుంచి వేరుచేస్తామని ఆయన స్పష్టం చేశారు. ఆంక్షల జాబితాలో భారత్‌కు చెందిన స్కైజ్ ట్రావెల్స్ అండ్ లాజిస్టిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఉంది. ఈ సంస్థ 2020 నుంచి మహాన్ ఎయిర్‌కు ఏజెంట్‌గా పనిచేస్తోందని, దీనికి ఢిల్లీ, శ్రీనగర్‌లలో కార్యాలయాలు ఉన్నాయని ట్రెజరీ విభాగం వివరించింది. మిగిలిన సంస్థలలో చైనాకు చెందిన షాంఘై వింగ్స్ ఇంటర్నేషనల్ లాజిస్టిక్స్, రష్యాకు చెందిన ఎయిర్ కార్గో ప్రో లిమిటెడ్, మరో చైనా సంస్థ షాంఘై ఎలైట్ ఇంటర్నేషనల్ ట్రావెల్, షాంఘై వింగ్స్ మేనేజింగ్ డైరెక్టర్ టాంగ్ జిన్ ఉన్నారు. మరోవైపు, ఐఆర్‌జీసీకి అనుబంధంగా పనిచేస్తున్న డేడ్‌నెగర్ స్టార్టప్ స్టూడియో అనే సంస్థపైనా అమెరికా చర్యలు తీసుకుంది. పశ్చిమాసియాలోని అమెరికా, ఇజ్రాయెల్ సైనిక పరికరాల లొకేషన్ల సమాచారాన్ని సేకరించి, ఇరాన్ సైనిక దాడులకు ఈ సంస్థ సహకరిస్తోందని అమెరికా ఆరోపించింది.

## కర్ణాటకకు రావొద్దు..
## తమిళనాడు సీఎం విజయ్‌కు డీకే శివకుమార్ సూచన

తమిళనాడు: కావేరి వివాదం నేపథ్యంలో తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ బెంగళూరు పర్యటనను వాయిదా వేసుకోవాలని కర్ణాటక సీఎం డీకే శివకుమార్ సూచించారు. ఆగస్టు 3న మంత్రులతో కలిసి బెంగళూరుకు వస్తానని విజయ్ తెలిపారని, ప్రస్తుత పరిస్థితుల్లో పర్యటన సరైనది కాదని తాను వివరించినట్లు చెప్పారు. విధానసౌధలో ఉప ముఖ్యమంత్రి జి.పరమేశ్వర, జలవనరుల శాఖ మంత్రి రామలింగారెడ్డితో కలిసి మీడియాతో మాట్లాడిన శివకుమార్.. అతిథులు వచ్చినప్పుడు ఆహ్వానించడం తమ బాధ్యతని అన్నారు. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో ఎవరైనా నిరసనలు చేపట్టినా, నినాదాలు చేసినా ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడతాయని పేర్కొన్నారు. అందుకే కొంతకాలం ఓపిక పట్టాలని విజయ్‌ను కోరినట్లు వెల్లడించారు. ఆదివారం జరగనున్న అఖిలపక్ష సమావేశం తర్వాత తదుపరి కార్యాచరణపై నిర్ణయం తీసుకుంటామని శివకుమార్ తెలిపారు. ప్రస్తుతం కర్ణాటకలో వర్షాలు కురుస్తుండటంతో జలాశయాల్లోకి నీటి ప్రవాహం పెరుగుతోందని, దీంతో చర్చలకు అనుకూల వాతావరణం ఏర్పడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రెండు రాష్ట్రాల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని కొత్త తేదీ ఖరారు చేస్తామని చెప్పారు. మేకెదాటు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ ప్రాజెక్టు కర్ణాటకతో పాటు తమిళనాడుకూ ప్రయోజనం చేకూరుస్తుందని శివకుమార్ అన్నారు. ఈ ప్రాజెక్టు తాగునీరు, విద్యుత్ ఉత్పత్తి కోసమేనని, సాగునీటి అవసరాలకు కాదని స్పష్టం చేశారు. కావేరి జలాల పంపిణీపై సుప్రీంకోర్టు తీర్పును గౌరవిస్తామని, అయితే వర్షాభావం, నీటి లభ్యత వంటి ప్రస్తుత పరిస్థితులను కూడా పరిగణనలోకి తీసుకోవాలని పేర్కొన్నారు.

## రాహుల్ గాంధీ అందుకే ప్రజలతో కనెక్ట్ కాలేకపోతున్నారు

అమరావతి: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై రాజ్యసభ మాజీ సభ్యుడు విజయసాయిరెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. భారత రాజకీయాల్లో రాహుల్ గాంధీ ప్రజలతో మమేకం కాలేకపోవడానికి గల కారణాన్ని విశ్లేషిస్తూ ఆయన భాషా నైపుణ్యాలపై విమర్శలు గుప్పించారు. విజయసాయిరెడ్డి సోషల్ మీడియాలో స్పందిస్తూ, "రాహుల్ గాంధీ సహజంగా ఇంగ్లీష్ లో బాగా మాట్లాడతారు. కానీ, భారతదేశంలో రాజకీయాల్లో గెలవాలంటే ప్రజలు రోజూ మాట్లాడే భాషలో ప్రావీణ్యం ఉండాలి. రాహుల్ హిందీ వింటుంటే, ఎవరో అనువదించి చెబుతున్నట్లు ఉంటుంది" అని వివరించారు. ఆయన హిందీలో ఇంగ్లీష్ పదాలు, యాస స్పష్టంగా కనిపిస్తాయని, స్థానిక నుడికారాలు, జాతీయాలు అసలు ఉండవని పేర్కొన్నారు. "రాహుల్ గాంధీ ఇంగ్లీష్‌లో ఆలోచించి హిందీలో మాట్లాడుతున్నట్లు అనిపిస్తుంది. ఈ కారణంగానే ఆయన సామాన్య ప్రజలతో సరిగ్గా కనెక్ట్ కాలేకపోతున్నారు" అని విజయసాయిరెడ్డి తన అభిప్రాయాన్ని వెల్లడించారు. ప్రజల భాషలో మాట్లాడటమే రాజకీయ విజయానికి పునాది అని, ఆ విషయంలో రాహుల్ వెనుకబడ్డారని ఆయన పరోక్షంగా వ్యాఖ్యానించారు.

## అక్రమ సంబంధాలపై పోలీసులకు సజ్జనార్ హెచ్చరిక

హైదరాబాద్: పోలీస్ శాఖ అంతర్గత క్రమశిక్షణ, పోలీస్ ప్రతిష్ఠ విషయంలో హైదరాబాద్ సీపీ సజ్జనార్ కఠిన వ్యాఖ్యలు చేశారు. ఓల్డ్ సిటీలోని సింహవాహిని మహంకాళి అమ్మవారి శిఖర పూజలో పాల్గొన్న అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఇటీవల చోటుచేసుకున్న వరుస వివాదాలపై స్పందిస్తూ, విధి నిర్వహణలో గానీ, వ్యక్తిగత ప్రవర్తనలో గానీ హద్దులు దాటే అధికారులపై ఉక్కుపాదం మోపుతామని స్పష్టం చేశారు. ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డిపై వచ్చిన ఆరోపణల కేసు విచారణ పూర్తిగా నిష్పాక్షికంగా కొనసాగుతుందని, ఎలాంటి ఒత్తిళ్లకు తలొగ్గేది లేదని సజ్జనార్ తెలిపారు. ఏ స్థాయి అధికారి అయినా అక్రమ సంబంధాలు, వేధింపులకు పాల్పడినట్లు తేలితే డిపార్ట్‌మెంట్ తరఫున కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇప్పటికే జూబ్లీహిల్స్, మలక్‌పేట్, దోమలగూడ ఠాణాల పరిధిలోని ఘటనలు, ట్రైనీ ఐపీఎస్ వ్యవహారంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారులను సస్పెండ్ చేశామని గుర్తుచేశారు. ఎస్బీ (స్పెషల్ బ్రాంచ్) ద్వారా నిఘా ఉంచి, వివాదాస్పద పోలీసుల వివరాలు సేకరిస్తున్నామని సజ్జనార్ తెలిపారు. పోలీస్ శ్రేణులు తమ ప్రాముఖ్యతను గుర్తుంచుకోవాలని, యూనిఫాం చాటున అనాలోచిత చర్యలకు పాల్పడితే సహించేది లేదన్నారు. బాధితులకు న్యాయం అందించడమే పోలీస్ వ్యవస్థ ప్రాథమిక కర్తవ్యమని, కొందరు వ్యక్తుల వల్ల మొత్తం శాఖకు మచ్చ రాకుండా కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు.

## ఉగ్రరూపం దాల్చిన గోదావరి..
## భద్రాచలం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక జారీ!

గోదావరి: ఎగువ ప్రాంతాల్లో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా భద్రాచలం వద్ద గోదావరి నది ఉగ్రరూపం దాల్చింది. భారీగా వచ్చి చేరుతున్న వరద నీటితో ఈ ఉదయానికి భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 44 అడుగులకు చేరింది. ప్రస్తుతం 9,74,666 క్యూసెక్కుల మేర ప్రవాహం కొనసాగుతుండటంతో అధికారులు మొదటి ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. వరద ఉద్ధృతికి కల్యాణకట్ట, స్నాన ఘట్టాలు పూర్తిగా నీట మునిగాయి. సాయంత్రానికి నీటిమట్టం మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో లంక గ్రామాలు, లోతట్టు ప్రాంతాల ప్రజలను జిల్లా యంత్రాంగం అప్రమత్తం చేసింది. అవసరమైతే ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించేందుకు రెవెన్యూ, విపత్తు నిర్వహణ బృందాలు సిద్ధంగా ఉన్నాయి. ప్రజలెవరూ గోదావరి వైపు వెళ్లకూడదని అధికారులు హెచ్చరించారు. మరోవైపు తెలంగాణవ్యాప్తంగా కురుస్తున్న వర్షాలకు శ్రీరాంసాగర్, మిడ్‌మానేరు, సింగూరు, ఎల్లంపల్లి, జూరాల వంటి ప్రధాన ప్రాజెక్టులన్నీ నిండుకుండలా మారాయి. కాళేశ్వరం వద్ద కూడా గోదావరి నీటిమట్టం 11.29 మీటర్లకు చేరి ప్రమాద స్థాయికి దగ్గరగా ప్రవహిస్తోంది. రాష్ట్రంలో మరో రెండు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది.

# భోగాపురం నుంచి రూ.17,900 కోట్లప్రాజెక్టులకు శ్రీకారం

విలువైన పలు కీలక అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. విజయనగరం జిల్లా భోగాపురం ఎయిర్ పోర్ట్ ప్రారంభోత్సవం ప్రధాని షెడ్యూల్ లో కీలకంగా నిలవనుంది. మోదీ పర్యటనకు సంబంధించిన అధికారిక ప్రకటనను ప్రధానమంత్రి కార్యాలయం (పీఎంఓ) విడుదల చేసింది. ఈ పర్యటన ఉత్తరాంధ్ర ప్రాంత ఆర్థిక ప్రగతికి గణనీయమైన ఊపునిస్తుందని భావిస్తున్నారు. అధికారిక షెడ్యూల్ ప్రకారం, ఆగస్టు 1న ఉదయం 10:45 గంటలకు ప్రధాని మోదీ ప్రత్యేక విమానంలో ఢిల్లీ నుంచి నేరుగా భోగాపురం ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. అక్కడ ఆయనకు గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి చంద్రబాబు స్వాగతం పలుకుతారు. ఉదయం 10:58 గంటలకు ప్రధాని టెర్మినల్ భవనాన్ని ప్రారంభించి, అనంతరం గవర్నర్, ముఖ్యమంత్రి, ఇతర ప్రముఖులతో కలిసి విమానాశ్రయంలోని సౌకర్యాలను పరిశీలిస్తారు. ఆ తర్వాత, ప్రధాని ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఓపెన్-టాప్ వాహనంలో బహిరంగ సభా ప్రాంగణానికి బయలుదేరుతారు. మార్గమధ్యలో 13,500 మందికి పైగా గిరిజన మహిళలు, విద్యార్థులు సంప్రదాయ 'ధింసా' నృత్యంతో ఆయనకు ఘన స్వాగతం పలకనున్నారు. ఉదయం 11:30 గంటల నుంచి మధ్యాహ్నం 12:55 గంటల వరకు ప్రధాని బహిరంగ సభలో ప్రసంగిస్తారు. అనంతరం మధ్యాహ్నం 1:10 గంటలకు కర్ణాటక పర్యటనకు పయనమవుతారు.

రికార్డు సమయంలో నిర్మాణం.. అంతర్జాతీయ ప్రమాణాలు

ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యం పద్ధతిలో జీఎంఆర్ విశాఖపట్నం ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ లిమిటెడ్ ఈ ప్రాజెక్టును అభివృద్ధి చేసింది. దేశంలోనే అత్యంత వేగంగా పూర్తయిన గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయాల్లో ఒకటిగా ఇది నిలిచింది. నిర్దేశిత గడువు కంటే ఐదు నెలల ముందే నిర్మాణం పూర్తి కావడం విశేషం. ఇప్పటికే ఈ విమానాశ్రయానికి డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ నుంచి ఏరోడ్రోమ్ లైసెన్స్‌తో పాటు భద్రత, అగ్నిమాపక, పర్యావరణ అనుమతులు లభించాయి. మొదటి దశలో ఏటా 60 లక్షల మంది ప్రయాణికులకు సేవలందించే సామర్థ్యంతో టెర్మినల్‌ను నిర్మించారు. భవిష్యత్తులో ఈ సామర్థ్యాన్ని 4 కోట్ల మందికి పెంచేలా మాస్టర్ ప్లాన్ రూపొందించారు. మొత్తం 2,703 ఎకరాల్లో విస్తరించిన ఈ ప్రాజెక్టులో 2,203 ఎకరాల్లో విమానాశ్రయం, మిగిలిన ప్రాంతంలో ఏవియేషన్ హబ్, ఏవియేషన్ యూనివర్సిటీ, ఎడ్యుసిటీ, వాణిజ్య, నివాస సముదాయాలు ఏర్పాటు చేయనున్నారు.

విమానాశ్రయం ప్రత్యేకతలు

ఈ విమానాశ్రయంలో 3,800 మీటర్ల పొడవైన 'కోడ్-ఈ' రన్‌వేను నిర్మించారు. దీనివల్ల బోయింగ్ 777, 787 డ్రీమ్‌లైనర్, ఎయిర్‌బస్ ఏ330, ఏ340 వంటి భారీ విమానాలు కూడా సులభంగా రాకపోకలు సాగించవచ్చు. అత్యాధునిక ఎయిర్‌ఫీల్డ్ లైటింగ్, నావిగేషన్ వ్యవస్థలు, స్వీయ-బ్యాగేజ్ డ్రాప్, స్మార్ట్ సర్వైలెన్స్ వంటి ఆధునిక టెక్నాలజీతో ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించారు. ఉత్తరాంధ్ర ఎగుమతుల వ్యవస్థను బలోపేతం చేసేందుకు ఏటా 25,000 మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో కార్గో టెర్మినల్‌ను నిర్మించారు. ఫార్మా, సముద్ర ఉత్పత్తుల వంటి వాటి రవాణా కోసం ప్రత్యేక కోల్డ్-చైన్ సౌకర్యాలు కూడా ఉన్నాయి. విశాఖపట్నం పోర్టు, పారిశ్రామిక కారిడార్లతో అనుసంధానం కావడం ద్వారా భోగాపురం తూర్పు తీరంలో కీలకమైన ఎయిర్ కార్గో, లాజిస్టిక్స్ హబ్‌గా మారనుంది. పర్యావరణ హితంగా ఉండేలా 'లీడ్ ప్లాటినం' ప్రమాణాలతో, 30 శాతం నీటి అవసరాలను రీసైకిల్ చేసిన నీటితో తీర్చేలా దీన్ని తీర్చిదిద్దారు. సముద్ర జీవి 'ఎగిరే చేప' ఆకారంలో టెర్మినల్ భవనాన్ని, పైకప్పులో 'రంగవల్లి' డిజైన్లను పొందుపరిచి స్థానిక సంస్కృతికి పెద్దపీట వేశారు. ఈ ప్రాజెక్ట్ కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం భూసేకరణ, రహదారులు, విద్యుత్, నీటి సరఫరా వంటి మౌలిక వసతుల కోసం రూ.1,583 కోట్లు పెట్టుబడిగా పెట్టింది. ఈ విమానాశ్రయం ద్వారా ఉత్తరాంధ్ర జిల్లాలైన విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళంతో పాటు పొరుగు రాష్ట్రాలకు కూడా కనెక్టివిటీ గణనీయంగా మెరుగుపడుతుంది. పర్యాటకం, లాజిస్టిక్స్, ఐటీ, ఏరోస్పేస్, రక్షణ, తయారీ రంగాల్లో కొత్త అవకాశాలకు ఇది ఊతమిస్తుందని ప్రభుత్వం ఆశాభావం వ్యక్తం చేసింది.

సెమీకండక్టర్, విద్యుత్ ప్రాజెక్టులు

రాష్ట్ర పారిశ్రామిక రంగంలో మరో కీలక ముందడుగుగా, విశాఖపట్నంలో ఏర్పాటు చేయనున్న ఆంధ్రప్రదేశ్‌లోని తొలి సెమీకండక్టర్ తయారీ యూనిట్‌కు ప్రధాని శంకుస్థాపన చేస్తారు. రూ.460 కోట్ల వ్యయంతో నిర్మించనున్న ఈ ప్లాంట్ ద్వారా ఏటా 96 మిలియన్ల చిప్‌లను ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. వీటితో పాటు, విద్యుత్ రంగాన్ని బలోపేతం చేసేందుకు ఉద్దేశించిన పలు ప్రాజెక్టులకు కూడా మోదీ శ్రీకారం చుట్టనున్నారు. రూ.5,550 కోట్లతో కర్నూలు-Ⅱ పునరుత్పాదక ఇంధన జోన్ ట్రాన్స్‌మిషన్ సిస్టమ్‌కు శంకుస్థాపన చేస్తారు. అలాగే, కర్నూలు, అనంతపురం సోలార్-విండ్ ఎనర్జీ జోన్‌లకు సంబంధించిన రూ.3,550 కోట్లు, రూ.820 కోట్ల విలువైన విద్యుత్ ప్రసార ప్రాజెక్టులను ప్రారంభిస్తారు.

జాతీయ రహదారులకు శంకుస్థాపన

రాష్ట్రంలో రోడ్డు మార్గాల అనుసంధానతను మెరుగుపరిచేందుకు సుమారు రూ.1,880 కోట్ల విలువైన జాతీయ రహదారుల ప్రాజెక్టులకు కూడా ప్రధాని శంకుస్థాపన చేయనున్నారు. ఈ ప్రాజెక్టుల వల్ల విజయవాడలో ట్రాఫిక్ భారం తగ్గడంతో పాటు, విశాఖపట్నం-హైదరాబాద్ మధ్య ప్రయాణ సమయం కూడా గణనీయంగా ఆదా అవుతుందని అధికారులు తెలిపారు.

### మైసూరులో వివేక స్మారక ప్రారంభం

ఆంధ్రప్రదేశ్ పర్యటన ముగించుకుని, ప్రధాని మోదీ మధ్యాహ్నం కర్ణాటకలోని మైసూరు చేరుకుంటారు. అక్కడ శ్రీ రామకృష్ణ ఆశ్రమంలో ఏర్పాటు చేసిన 'స్వామి వివేకానంద కల్చరల్ యూత్ సెంటర్ - వివేక స్మారక'ను ప్రారంభిస్తారు. 1892లో స్వామి వివేకానంద మైసూరును సందర్శించి, ఇక్కడి మహారాజా శ్రీ చామరాజేంద్ర వడియార్-Ⅹ అందించిన సహకారంతోనే చికాగో సర్వమత సమ్మేళనానికి వెళ్లారు. ఆ చారిత్రక ఘట్టానికి గుర్తుగా ఈ స్మారకాన్ని నిర్మించారు. 81,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో రూపుదిద్దుకున్న ఈ కేంద్రంలో 4-డీ ఎక్స్‌పీరియన్స్ సెంటర్, యాంఫీ థియేటర్, గ్రంథాలయం, ధ్యాన మందిరం వంటి సదుపాయాలు ఉన్నాయి. యువతలో విలువ ఆధారిత విద్య, నాయకత్వ లక్షణాలు, వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించడమే ఈ కేంద్రం ముఖ్య లక్ష్యం.

# మోదీ చేసిన అప్పు రూ.151 లక్షల కోట్లు

ఇప్పటి వరకు దేశంపై ఉన్న అప్పు రూ.201 లక్షల కోట్లు అని పేర్కొన్నారు. కొందరు చిన్న చిన్న సంఘటనలు చూపి గొప్ప గొప్ప విజయాలుగా మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. ఆనాడు ఎన్నో యుద్ధాలను ఎదుర్కొని భారత్‌ను సార్వభౌమ దేశంగా మార్చిన వారి గురించి తక్కువ చేసి మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు.

పనితీరు కనబరిచినందుకు రాజీనామా చేయాలా?

'విద్యాశాఖ మంత్రిగా రేవంత్‌రెడ్డి వైదొలగాలని కొందరు మాట్లాడుతున్నారు. ఉత్తమ పనితీరు కనబరిచినందుకు విద్యాశాఖకు రాజీనామా చేయాలా? నర్సరీ నుంచి 12వ తరగతి వరకు బ్రేక్‌ఫాస్ట్ ఇస్తున్నందుకా? టీచర్ల నియామకం, పదోన్నతులు సక్రమంగా నిర్వహించినందుకా? ఐటీఐలను ఆధునిక సాంకేతిక కేంద్రాలుగా మార్చినందుకా? విద్యార్థులకు నైపుణ్యం అందించేందుకు స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేసినందుకా? ప్రపంచంలోనే సక్సెస్ అయిన కార్పొరేట్ సంస్థల యజమానులను స్కిల్స్ వర్సిటీ బోర్డు సభ్యులుగా నియమించినందుకా' అని సీఎం రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. ఫిన్‌లాండ్, జర్మనీలో పర్యటించి వచ్చిన ఉపాధ్యాయులతో ముఖాముఖి సందర్భంగా గురువారం ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. 2034 వరకు ప్రజా ప్రభుత్వమే అధికారంలో ఉంటుందని, తానే ముఖ్యమంత్రిగా ఉంటానని పునరుద్ఘాటించారు. 80 వేల పుస్తకాలు చదివి కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు కూళేశ్వరం అయిందని ఎద్దేవా చేశారు.

మొదటి తారీఖునే జీతాలు

ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకే ప్రభుత్వ ఉద్యోగులకు మొదటి తారీఖున జీతాలు అందుతున్నాయని సీఎం రేవంత్ అన్నారు. 'ప్రభుత్వ పాఠశాలల్లో అనేక సంస్కరణలు తెచ్చాం . విద్యార్థులతోపాటు ఉపాధ్యాయులకు బ్రేక్ ఫాస్ట్, లంచ్ అందిస్తున్నాం . పిల్లలు తల్లిదండ్రులకు స్ట్రెస్ బస్టర్స్‌ం. అందుకే డే స్కాలర్ విద్యార్థులకు కూడా బ్రేక్ ఫాస్ట్, లంచ్ అందిస్తున్నాం . సమాజంలో మానవ సంబంధాలు విచ్?ఛన్నమైతే ఏ కుటుంబం, ఏ దేశం నిలబడదు. తల్లిదండ్రుల కంటే ఉపాధ్యాయుల దగ్గరే పిల్లలు ఎక్కువ సమయం ఉంటారు. తల్లిదండ్రులకు ఎంత బాధ్యత ఉంటుందో ఉపాధ్యాయులకూ అంతే బాధ్యత ఉంది . విద్యార్థుల కోసం ఎంత ఖర్చు చేయడానికైనా ప్రభుత్వం సిద్ధంగా ఉంది. ఇక నుంచి ఐఏఎస్, ఐపీఎస్‌లతో సమానంగా ఏటా 10--15 మంది టీచర్లను విదేశాలకు పంపి చదువుకునేందుకు అవకాశం కల్పిద్దాం. ఓట్లు, రాజకీయం కోసం నేను పనులు చేయడం లేదు. నాణ్యమైన విద్యను అందించాలనే బాధ్యతతో పనిచేసుకుంటూ వెళ్తున్నా. నా సంకల్పాన్ని మీరు ముందుకు తీసుకెళ్లేందుకు ఇక్కడి నుంచే దీక్ష తీసుకుని బయలుదేరండి' అని ఉపాధ్యాయులకు చెప్పారు.

విద్యార్థుల సమస్యలపై కొట్లాడండి

'ఇంగ్లిష్ ఒక్కటే ముఖ్యమనుకుంటే చైనా ప్రపంచాన్ని ఎలా శాసిస్తోంది? 25 ఏళ్లు అమెరికా వైపు చూశాం.ం ఇప్పుడు ఫోకస్ పెట్టాల్సింది జర్మనీ, జపాన్, సింగపూర్ లాంటి దేశాలపై . ఆ దేశాల్లో అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి . ప్రపంచ దేశాలు మనవైపు చూసేలా ప్రభుత్వ విద్యా సంస్థలను తీర్చిదిద్దుదాం . ఉపాధ్యాయ సంఘాలు మీ సమస్యలపై కాదు.. విద్యార్థుల సమస్యలపై కొట్లాడాలి. ఐదేళ్ల సమాజం కోసం, తరతరాల భవిష్యత్‌ను మార్చేందుకు ప్రతిజ్ఞ పూనండి . నాణ్యమైన విద్య అందించేందుకు ఇంకా ఏం చేయాలో మీరే సూచించండి . వచ్చే విద్యా సంవత్సరానికి ఏం చేస్తే బాగుంటుందో డిసెంబరులోగా నివేదిక ఇవ్వండి . ప్రతీ మండలాన్ని ఒక క్లస్టర్‌గా ఏర్పాటు చేసి ప్రణాళిక సిద్ధం చేయండి ' అని సీఎం చెప్పారు.

ఒక్కో విద్యార్థిపై రూ.1.08 లక్షలు

'ప్రతీ పేదవాడికి విద్యతోపాటు వారిని ప్రపంచంతో పోటీ పడేలా తీర్చిదిద్దాలి. నాణ్యమైన విద్య, పౌష్టిక ఆహారం అందిచడమే లక్ష్యంగా పనిచేయాలి . ఏ ఆస్తులు లేకపోయినా చదువుకొని ఉద్యోగాలు సాధించిన వారు ప్రపంచంతో పోటీ పడుతున్నారు. ప్రభుత్వ ఆదాయం పెంచడం, పేదలకు పంచడమే మా ప్రభుత్వ లక్ష్యం . ఒక్కో విద్యార్?థిపై ప్రభుత్వం రూ.1.08 లక్షలు ఖర్చు చేస్తోంది . ప్రైవేటు స్కూల్ పిల్లలకు వారి తల్లిదండ్రులు చేస్తున్న ఖర్చు దాదాపు రూ.50 వేలు. ప్రభుత్వం ఎంతో వెచ్చిస్తున్నా తల్లిదండ్రులు ప్రైవేటు బడులకు ఎందుకు ప్రాధాన్యతనిస్తున్నారో ఒకసారి ఆలోచించాలి ' అని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

## పోరాటాలను అక్రమ కేసులు ఆపలేవు
### నాంపల్లి కోర్టుకు హాజరైన కేటీఆర్

హైదరాబాద్: "ప్రజల తరఫున మేం చేసే పోరాటాలను ఇటువంటి తప్పుడు కేసులు ఎంతమాత్రం ఆపలేవు.. అంతిమంగా సత్యమే గెలుస్తుంది" అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ఘాటుగా వ్యాఖ్యానించారు. ఫార్ములా-ఈ రేసు వ్యవహారానికి సంబంధించిన కేసు విచారణలో భాగంగా నాంపల్లి కోర్టుకు హాజరైన సందర్భంగా ఆయన కాంగ్రెస్ ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. ఉదయం కోకాపేటలోని తన నివాసం నుంచి నేరుగా నాంపల్లి కోర్టుకు కేటీఆర్ చేరుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తనపై కుట్రపూరితంగా అక్రమ కేసు బనాయించిందని ఆయన మండిపడ్డారు. మరోవైపు, తదుపరి విచారణకు కోర్టు ఆగస్టు 25కి వాయిదా వేసింది. కోర్టు ప్రక్రియ ముగిసిన అనంతరం, అకాల మరణం చెందిన పార్టీ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి అంత్యక్రియల్లో పాల్గొనేందుకు ఆయన నర్సంపేటకు బయలుదేరారు.

కేసు నేపథ్యం:

యూకేకు చెందిన 'ఫార్ములా-ఈ ఆర్గనైజేషన్'కు నిబంధనలకు విరుద్ధంగా రూ. 55 కోట్లు మళ్లించారనే అభియోగంపై ఏసీబీ ఈ కేసు నమోదు చేసింది. సుదీర్ఘ దర్యాప్తు అనంతరం ఏసీబీ దాఖలు చేసిన ఛార్జ్‌షీట్‌ను కోర్టు పరిగణనలోకి తీసుకోవడంతో, నిందితులుగా ఉన్న కేటీఆర్‌తో పాటు మాజీ ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్, హెచ్ఎండీఏ మాజీ అధికారి బీఎల్ఎన్ రెడ్డి తదితరులు న్యాయస్థానానికి హాజరయ్యారు.


## పేపర్ లీక్‌లపై కేంద్రం ఉక్కుపాదం..
## రాజ్యసభలోనూ ఆమోదం పొందిన బిల్లు

ఢిల్లీ: దేశవ్యాప్తంగా పరీక్షల నిర్వహణలో పారదర్శకత పెంచడం, పేపర్ లీక్‌లను అరికట్టడం లక్ష్యంగా తీసుకొచ్చిన పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫెయిర్ మీన్స్) సవరణ బిల్లు-2026కు పార్లమెంట్ ఆమోదం లభించింది. ఇప్పటికే లోక్‌సభలో ఆమోదం పొందిన ఈ బిల్లుకు గురువారం రాజ్యసభలోనూ ఆమోదం లభించింది. దీంతో రాష్ట్రపతి అంగీకారం లభించగానే ఇది చట్టంగా అమల్లోకి రానుంది. కేంద్ర సిబ్బంది, ప్రజా ఫిర్యాదులు, పెన్షన్ల శాఖ మంత్రి జితేంద్ర సింగ్ ఈ బిల్లును రాజ్యసభలో ప్రవేశపెట్టారు. చర్చ సందర్భంగా ప్రభుత్వం, ప్రతిపక్ష సభ్యుల మధ్య వాడివేడీ వాదనలు జరిగాయి. పేపర్ లీక్ మాఫియాపై కఠిన చర్యలు తీసుకోవడానికే ఈ సవరణలు తీసుకొచ్చామని ప్రభుత్వం స్పష్టం చేసింది. భారీ జరిమానాలు, ప్రత్యేక కోర్టులు, వేగవంతమైన విచారణలతో అక్రమాలకు అడ్డుకట్ట వేస్తామని తెలిపింది. ఈ సవరణల ప్రకారం పేపర్ లీక్‌లకు పాల్పడిన వారిపై గరిష్ఠంగా రూ.10 కోట్ల వరకు జరిమానా విధించే అవకాశం ఉంటుంది. జైలు శిక్షతో పాటు ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల్లో విచారణ పూర్తి చేసే నిబంధనలను కూడా చేర్చారు. పరీక్షల నిర్వహణలో అక్రమాలకు పాల్పడే ముఠాలపై మరింత కఠినంగా వ్యవహరించేందుకు ఈ మార్పులు ఉపయోగపడతాయని ప్రభుత్వం పేర్కొంది. 2024లో తీసుకొచ్చిన చట్టం అమలులో వచ్చిన అనుభవాల ఆధారంగానే ఈ సవరణలు రూపొందించినట్లు జితేంద్ర సింగ్ తెలిపారు. ఆ చట్టం అమల్లోకి వచ్చిన తర్వాత 52 ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయని చెప్పారు. పేపర్ లీక్‌ల కారణంగా ఆత్మహత్యల సంఖ్య కూడా తగ్గిందని సభకు వివరించారు. అయితే ప్రతిపక్షం మాత్రం బిల్లుపై విమర్శలు గుప్పించింది. కేవలం శిక్షలు పెంచడం సరిపోదని, పరీక్షల నిర్వహణ వ్యవస్థలో సమగ్ర సంస్కరణలు అవసరమని డిమాండ్ చేసింది. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ పనితీరుపైనా ప్రశ్నలు లేవనెత్తింది. మరోవైపు విద్యార్థుల ప్రయోజనాల కోసం కేంద్రం వేగంగా చర్యలు తీసుకుందని అధికార పక్షం పేర్కొంది. మాజీ విద్యాశాఖ మంత్రి రాజీనామా, నందన్ నీలేకని నేతృత్వంలో టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు, నీట్ పరీక్షను రద్దు చేసి తిరిగి నిర్వహించడం వంటి చర్యలను ప్రస్తావించింది.

## సూపర్ ఎల్ నినో సమయంలో ప్రతి నీటి బొట్టు విలువైనదే....

నీటి వృథాను అరికట్టాలని పిలుపునిచ్చారు. డిప్యూటీ సీఎం క్యాంపు కార్యాలయంలో జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఆయనతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని సాగునీటి పరిస్థితులపై ఇరువురూ విస్తృతంగా చర్చించారు. నీటి ఎద్దడిపై రైతుల్లో అవగాహన కల్పించడంతో పాటు, ప్రత్యామ్నాయ సాగు మార్గాలపై దృష్టి సారించాలని పవన్ సూచించారు. రైతుల ఆందోళనను తగ్గించేందుకు అధికారులతో పాటు ప్రజాప్రతినిధులు కూడా బాధ్యత తీసుకోవాలన్నారు. పిఠాపురం, పెద్దాపురం, జగ్గంపేట నియోజకవర్గాల రైతు ప్రయోజనాల కోసం ఏలేరు ప్రాజెక్టు నుంచి వెయ్యి క్యూసెక్కుల నీటిని విడుదల చేసినందుకు మంత్రి నిమ్మల రామానాయుడికి పవన్ కల్యాణ్ కృతజ్ఞతలు తెలిపారు. క్షేత్రస్థాయి పరిస్థితులను పరిశీలించేందుకు తానే స్వయంగా ఏలేరు ఆయకట్టు ప్రాంతాల్లో పర్యటిస్తున్నట్లు మంత్రి వివరించారు. కాగా, ఇటీవల శస్త్రచికిత్స చేయించుకున్న పవన్ కల్యాణ్ ఆరోగ్య పరిస్థితిని మంత్రి నిమ్మల అడిగి తెలుసుకున్నారు. ఆయన త్వరితగతిన పూర్తి కోలుకుని, మళ్లీ ప్రజాసేవలో మునుపటి కంటే మరింత చురుగ్గా పాల్గొనాలని ఆకాంక్షించారు.

## ఏపీలో 'సర్' ముసాయిదా ఓటరు జాబితా విడుదల..
### నియోజకవర్గాల వారీగా వివరాలివీ..



అమరావతి: ఏపీలో ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ముసాయిదా ఓటరు జాబితా విడుదల అయింది. 3.71 కోట్ల మంది ఓటర్లు తమ ఎన్యూమరేషన్ ఫారాలు సమర్పించారని సీఈవో వివేక్ యాదవ్ తెలిపారు. ఎన్నికల సంఘం తెలిపిన వివరాల ప్రకారం.. మొత్తం 4.16 కోట్ల ఓటర్లలో 89.22 శాతం మంది ఫారాలు ఇచ్చారు. 15.22 లక్షల మందిని మృతులుగా గుర్తించారు. 22.30 లక్షల మంది శాశ్వతంగా మారినట్లు లేదా గైర్హాజరైనట్లు నిర్ధరించారు. 7.37 లక్షల మంది పేర్లు రెండు, మూడు చోట్ల నమోదైనట్లు తేల్చారు. ఒకటి కంటే ఎక్కువచోట్ల ఓటు ఉన్నవారి పేరు ఒకే చోట కొనసాగించారు. నిజమైన ఓటర్లు ఫారం-6తో మళ్లీ నమోదు చేసుకునే అవకాశముంది. జులై 31 నుంచి ఆగస్ట్ 30 వరకు అభ్యంతరాలను స్వీకరించి.. అక్టోబర్ 3న తుది ఓటరు జాబితా ప్రకటించనున్నారు. రాష్ట్రంలోని 175 అసెంబ్లీ నియోజకవర్గాల ముసాయిదా ఓటరు జాబితాను అధికారులు విడుదల చేశారు. నోటీసు, విచారణ లేకుండా ఏ ఓటరు పేరునూ తొలగించబోమని అధికారులు తెలిపారు. అర్హులైన ఎవరూ ఓటు హక్కుకు దూరం కాకూడదనే నిర్ణయానికి ఈసీ కట్టుబడి ఉందని సీఈవో తెలిపారు. అనర్హులు చేరకుండా పారదర్శక ప్రక్రియకు కట్టుబడి ఉన్నామన్నారు.

## టేకాఫ్‌కు ఉత్తరాంధ్ర సిద్ధం..
### మోదీజీ మీ రాకకోసం ఎదురుచూస్తున్నాం



అమరావతి: భోగాపురంలోని అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవానికి సర్వం సిద్ధమైంది. దీన్ని ప్రధాని నరేంద్ర మోదీ శనివారం ప్రారంభించనున్నారు. ఈ నేపథ్యంలో మోదీ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. "నేడు భోగాపురంలో అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ప్రారంభించనున్నాం. ఇది దేశ మౌలిక సదుపాయాల అభివృద్ధిలో మరో కీలక మైలురాయి" అని తెలిపారు. ప్రధాని పోస్టును సీఎం చంద్రబాబు షేర్ చేశారు. "ఉత్తరాంధ్ర టేకాఫ్‌కు సిద్ధంగా ఉంది. మోదీజీ.. మీ రాక కోసం ఎదురు చూస్తున్నాం" అని సీఎం పేర్కొన్నారు. భోగాపురం విమానాశ్రయం ప్రారంభంతో ఉత్తరాంధ్ర అభివృద్ధికి కొత్త ఊపిరి లభిస్తుందని.. పెట్టుబడులు, పర్యాటకం, ఉపాధి అవకాశాలు మరింత విస్తరించనున్నాయని కూటమి ప్రభుత్వం భావిస్తోంది.

## రేషన్ కార్డుదారులకు ఊరట..
# ఈ-కేవైసీ గడువు పెంపు

హైదరాబాద్: రేషన్ కార్డుదారులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఊరట కల్పించింది. ఈ-కేవైసీ పూర్తి చేసుకునేందుకు ఇచ్చిన గడువును ఆగస్టు 31 వరకు పొడిగించింది. గడువు శుక్రవారంతో ముగియనున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకుంది. వివిధ కారణాలతో ఇప్పటివరకు ఈ-కేవైసీ పూర్తి చేయలేకపోయిన వారికి ఇది పెద్ద ఊరటగా మారింది. మొదట ఈ వెసులుబాటును జీహెచ్ఎంసీ పరిధిలోని లబ్ధిదారులకు మాత్రమే ఇవ్వాలని నిర్ణయించారు. అయితే ఇతర జిల్లాల నుంచి వచ్చిన విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకుని రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయాలని నిర్ణయించారు. రాష్ట్రంలో కొనసాగుతున్న 'స్మార్ట్' ప్రక్రియ, పలు జిల్లాల్లో కురుస్తున్న భారీ వర్షాల వల్ల ప్రజలు ఇబ్బందులు పడకుండా ఉండేందుకే గడువు పెంచినట్లు అధికారులు తెలిపారు. మరోవైపు రేషన్ కార్డుదారులకు మరో శుభవార్త కూడా ఉంది. ఈ-కేవైసీ పూర్తయిందా లేదా అన్న దానితో సంబంధం లేకుండా శనివారం నుంచి మూడు నెలల బియ్యం, ఇతర రేషన్ సరకులను ఒకేసారి పంపిణీ చేయనున్నారు. సూపర్ ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో పెట్టుకుని కేంద్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఇంకా ఈ-కేవైసీ పూర్తి చేయని వారు ఆగస్టు 31లోపు సమీప రేషన్ దుకాణంలో ప్రక్రియ పూర్తి చేసుకోవచ్చని అధికారులు స్పష్టం చేశారు.

## సిపిఐ జిల్లా స్థాయి శిక్షణ తరగతులు విజయవంతం - మునెప్ప



మంత్రాలయం,శివసూర్య, జూలై 31:భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ కర్నూలు జిల్లా స్థాయి శిక్షణ తరగతులు జులై 28, 29, 30 తేదీలలో మంత్రాలయం హెచ్ఆర్బి కళ్యాణమండపంలో విజయవంతంగా నిర్వహించామని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.మునెప్ప హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాస్థాయి శిక్షణ తరగతులకు సహకరించిన వివిధ రాజకీయ పార్టీ నాయకులకు, సానుభూతిపరులకు, శ్రేయోభిలాషులకు, దాతలకు సిపిఐ పార్టీ తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ప్రస్తుతం ప్రజలపై పడుతున్న ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు, భవిష్యత్తులో నిర్వహించే పోరాటాలకు, ఉద్యమాలకు ఇదే విధంగా అందరూ సహకరించాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ మూడు రోజుల శిక్షణ తరగతుల్లో పార్టీ విధానాలు, ప్రజా సమస్యలు, రాబోయే ఉద్యమాలపై చర్చలు జరిగాయి.ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు జి.భాస్కర్ యాదవ్, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కే.శ్రీనివాసులు, ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి టి.తామస్, సిపిఐ మంత్రాలయం పట్టణ కార్యదర్శి ఎం.రాజు తదితరులు పాల్గొన్నారు.

## మంత్రాలయంలో ఓటర్ల జాబితా పూర్తి... 15,676 మంది తొలగింపు

30 కొత్త పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు



మంత్రాలయం,శివసూర్య, జూలై 31:మంత్రాలయం తహసీల్దార్ కార్యాలయంలో ఓటరు నమోదు అధికారి, ప్రత్యేక ఉప కలెక్టర్ అనురాధ అధ్యక్షతన రాజకీయ పార్టీల సమావేశం జరిగింది.ఈ సందర్భంగా ఓటరు జాబితా ముసాయిదాను ప్రచురించి, సాఫ్ట్ కాపీని అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందజేశారు. నియోజకవర్గంలో ఓటర్ల సౌకర్యార్థం 30 కొత్త పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు.ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ూ×=) కార్యక్రమం పూర్తయిందని డిప్యూటీ కలెక్టర్ అనురాధ, ఎమ్మార్వో రమాదేవి, డిప్యూటీ ఎమ్మార్వో గురు రాజారావు వెల్లడించారు.ూ×= ప్రక్రియలో భాగంగా మరణించినవారు, గ్రామాల్లో నివాసం లేనివారు, డబుల్ ఎంట్రీలు కలిగిన మొత్తం 15,676 మంది ఓటర్లను తుది జాబితా నుండి తొలగించినట్లు వారు వివరించారు.తొలగించిన ఓటర్లపై ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే ఆగస్ట్ 30వ తేదీ వరకు సంబంధిత ఎమ్మార్వో కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చని అధికారులు సూచించారు.సమావేశంలో అన్ని రాజకీయ పార్టీల నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

## రాఘవేంద్ర రెడ్డి నాయకత్వానికి జేజేలు... అర్లబండ నుండి టీడీపీలోకి 50 కుటుంబాలు




మంత్రాలయం,శివసూర్య, జూలై 31:మంత్రాలయం తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి ఎన్.రాఘవేంద్ర రెడ్డి నాయకత్వంపై విశ్వాసం వ్యక్తం చేస్తూ అర్లబండ గ్రామానికి చెందిన సుమారు 50 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. మంత్రాలయం టీడీపీ ఇంచార్జి కార్యాలయంలో రాఘవేంద్ర రెడ్డి, ఆయన సోదరుడు మంత్రాలయం సొసైటీ చైర్మన్ ఎన్ రామకృష్ణారెడ్డి సమక్షంలో చేరిన వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు.పార్టీలో చేరిన నాయకులు మాట్లాడుతూ, “ప్రజా సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందించే రాఘవేంద్ర రెడ్డి నాయకత్వంపై నమ్మకంతో టీడీపీలో చేరుతున్నాం. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ నాయకత్వంలోని కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో విశ్వాసం పెరుగుతోంది. గ్రామ అభివృద్ధే లక్ష్యంగా టీడీపీని బలోపేతం చేస్తాం” అని తెలిపారు.రాఘవేంద్ర రెడ్డి మాట్లాడుతూ, “ప్రజల నమ్మకమే మా బలం. ప్రజల మధ్యే ఉంటూ ప్రతి సమస్య పరిష్కరిస్తాం. మంత్రాలయం అభివృద్ధే మా ధ్యేయం” అని అన్నారు.ఈ కార్యక్రమంలో అర్లబండ సొసైటీ చైర్మన్ నాడిగినేని అయ్యన్న, కోసిగి మాజీ మండల అధ్యక్షులు జ్ఞానేష్, సర్పంచ్ తదితరులు పాల్గొన్నారు.

## “కూటమి ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు చేరవేత”



మంత్రాలయం,శివసూర్య, జూలై 31:ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రజాసేవా దృక్పథంతో, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ యువత, విద్యాభివృద్ధికి అంకితమైన కృషితో రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న 45 రోజుల “ఇంటింటా తెలుగుదేశం” కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతోంది.ఈ కార్యక్రమంలో భాగంగా మంత్రాలయం పట్టణంలోని రాఘవేంద్రపురం కాలనీలో 4వ రోజు పర్యటన నిర్వహించారు. పట్టణ టీడీపీ అధ్యక్షుడు వరదరాజు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఆయనతో పాటు అశోక్ రెడ్డి, క్లస్టర్ ఇంచార్జ్ పవన్ కుమార్, ఎంపీటీసీ వెంకటేష్, సొసైటీ డైరెక్టర్ డి.సి తిమ్మప్ప, చిదానంద, రమేష్, బీమా, దాసు, వెంకీ, సుంకన్న, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.నాయకులు ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై కరపత్రాలు పంచి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కాలనీ ప్రజలు తమ సమస్యలను నాయకుల దృష్టికి తీసుకెళ్లారు. రాత్రిపూట వీధిలైట్లు సరిగా వెలగకపోవడంతో ఆడవారు, పిల్లలు బయటకు రావడానికి భయపడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. త్రాగునీటి సరఫరాలో అంతరాయాలు గురించి విన్నవించారు.ప్రజల సమస్యలను సానుకూలంగా స్పందించిన వరదరాజు, వెంటనే సంబంధిత మున్సిపల్ అధికారులతో మాట్లాడి వీధిలైట్లు సమస్యను త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ప్రజలకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని, కూటమి ప్రభుత్వ ధ్యేయం అభివృద్ధి -- సంక్షేమేనని తెలిపారు.ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు మరియు కాలనీ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మంత్రాలయం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి కోర్టు నిర్మాణానికి 50 వేల విరాళంబి



మంత్రాలయం,శివసూర్య, జూలై 31:ఎమ్మిగనూరు పట్టణంలోని న్యాయవాదుల సంఘం తరుపున నూతనంగా మంజూరైన సబ్ కోర్టు మరియు అదనపు కోర్టు భవనాల అభివృద్ధి కార్యక్రమం నిమిత్తం సహాయ సహకారాలు అందించాలని మంత్రాలయం ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు.ఆయన ఆదేశాల మేరకు వైఎస్సార్సీపీ నేత వై. ప్రదీప్ రెడ్డి చేతుల మీదుగా ఎమ్మిగనూరు పట్టణంలోని భీమా నిలయంలో లీగల్ సెల్ ప్రతినిధి మాలపల్లి గురురాజరావు స్వామి ఆధ్వర్యంలో న్యాయవాదుల సంఘం ప్రతినిధులకు రూ 50 వేల నగదును అందజేశారు.సంఘం తరపున రెడ్డి సోదరులకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో న్యాయవాదులు డి లక్ష్మీనారాయణ రెడ్డి, రసీదుల్లా, మల్లికార్జున, రంగనాథ, పార్లపల్లి మల్లి తదితరులు పాల్గొన్నారు.

## వేలాది మంది విద్యార్థులను... అత్యున్నత విద్యావంతులుగా తీర్చిదిద్దడం నాకెంతో గర్వకారణం





కర్నూలు,శివసూర్య, జూలై 31:ప్రతి ఒక్కరూ వృత్తి పరంగా అన్ని విధాలుగా సంపాదించుకుంటారు కానీ, వృత్తిలో సంతోషకరమైన విషయం ఏమిటంటే వేలాదిమంది విద్యార్థులను విద్యావంతులుగా




తీర్చిదిద్దడం, అత్యున్నత విద్యావంతులుగా మారి ఉపాధిలో రాణించడం తమకు ఎంతో సంతోషాన్ని ఇస్తుందని బి. క్యాంప్ లోని ప్రభుత్వ జూనియర్ ఒకేషనల్ కళాశాల జూనియర్ ఇంగ్లీష్ లెక్చరర్ జి ప్రసన్న కుమార్ పేర్కొన్నారు. ప్రసన్న కుమార్, అరుణశ్రీ ల పదవీ విరమణ వేడుకలు శుక్రవారం కళాశాల ప్రాంగణంలో కోలాహలం మధ్య సాగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 36 సంవత్సరాల సుదీర్ఘ కాలంగా సేవలందించడం జరిగిందని,ఇది అంతా కూడా తమ పూర్వ జన్మ సుకృతమే అన్నారు. తమ తల్లిదండ్రులు అందించిన సహకారంతోనే విద్యా వంతులుగా ఎదిగి, భారత పౌరులుగా తీర్చి దిద్దేందుకు చక్కటి అవకాశం కలిగిందన్నారు. తన పదవి విరమణ తర్వాత కూడా విద్యార్థులకు ఏవైనా విద్యా పరంగా ఇబ్బందులు ఉన్నట్లయితే నివృత్తి చేసుకునేందుకు తన యొక్క ఫోన్ నెంబర్ పిల్లలకు ఇవ్వడం జరిగిందని తెలిపారు. పిల్లలతో తనకున్న అనుబంధం విడదీయలేనిదని చెప్పారు. విద్యార్థులను అత్యున్నత స్థాయిలో తీర్చిదిద్దేందుకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు. 26 సంవత్సరాల సుదీర్ఘ సేవలను కర్నూలు బి క్యాంపు బాలికల ఉన్నత పాఠశాల నందు అందించడం జరిగిందని అరుణశ్రీ చెప్పారు. తనకు ఎంప్లాయిమెంట్ కార్యాలయం నుండి ఉపాధ్యాయురాలుగా పదవి లభించడం జరిగిందని ఆమె గుర్తు చేశారు. తన పేరు ఢిల్లీ వరకు చేరిందంటే నృత్యం, సంగీత పరంగానే అన్నారు.తాను మ్యూజికల్ టీచర్ అని చెప్పారు. అనంతరం అరుణశ్రీ ఆలపించిన గానం ఆహుతులను ఎంతగానో అలరించింది.అనంతరం అధ్యాపక బృందం, విద్యార్థులు, బంధుమిత్రులు పుష్ప గుచ్చాలు,పూలమాలలు, శాలువలు, కానుకలు అందించి ఘనంగా సత్కరించి సన్మానించారు.

## మంత్రాలయంలో అమరావతి క్రీడలకు శ్రీకారం



మంత్రాలయం,శివసూర్య, జూలై 31:మంత్రాలయంలో అమరావతి ఛాంపియన్‌షిప్ గేమ్స్ ఘనంగా ప్రారంభమయ్యాయి. క్రీడల ద్వారా విద్యార్థుల్లో క్రమశిక్షణ, క్రీడా స్ఫూర్తిని పెంపొందించే లక్ష్యంతో ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.కౌతాళం వీజూ రామాంజనేయులు, వీజూ శోభారాణి ముఖ్య అతిథులుగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి క్రీడలను ప్రారంభించారు. విద్యార్థులు క్రీడల్లో చురుగ్గా పాల్గొని తమ ప్రతిభను చాటాలని, ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని వారు సూచించారు.ఈ సందర్భంగా సీనియర్ ఉపాధ్యాయుడు లక్ష్మీకాంత్ మాట్లాడుతూ, చదువుతో పాటు క్రీడలు కూడా విద్యార్థుల సర్వతోముఖ అభివృద్ధికి దోహదపడతాయని అన్నారు. కోఆర్డినేటర్ కవిరాజు, ఋూూ శీఎంవతీజవతీ యూసుఫ్ మాట్లాడుతూ జిల్లా స్థాయి పోటీలకు విద్యార్థులను సిద్ధం చేస్తామని చెప్పారు.ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు ఖలీల్, రవీంద్ర, రాము, శిరీష, రూప, శ్రీరామ్ తో పాటు పలు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అథ్లెటిక్స్, కబడ్డీ, ఖోఖో, చెస్ తదితర పోటీలు మూడు రోజుల పాటు జరుగుతాయి.

## ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాం: ఎమ్మార్వో




మంత్రాలయం,శివసూర్య,జూలై 31:మంత్రాలయం మండలం వగరూరు గ్రామంలో గ్రామ సభను ఎమ్మార్వో రమాదేవి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఒక నెల – ఒక సమస్య – 4 సందర్భాలు కార్యక్రమంలో భాగంగా ఈ సభ జరిగింది.ఈ సందర్భంగా గ్రామస్తులు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. గ్రామంలో విద్యుత్ కు సంబంధించి 2 ఫిర్యాదులు, డ్రైనేజీ సమస్యపై ఒక ఫిర్యాదు అందినట్లు ఎమ్మార్వో రమాదేవి తెలిపారు. ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ఆమె హామీ ఇచ్చారు.

## మెళియాపుట్టి మండలంలో పురుగు మందు తాగి వివాహిత మృతి



మెళియాపుట్టి, శివ సూర్య, జులై 31: మెళియాపుట్టి మండలం బాణాపురం పంచాయతీ పరిధిలోని బగడ గ్రామానికి చెందిన 52 ఏళ్ల వివాహిత దిమిలి కళావతి శుక్రవారం ఉదయం పురుగుల మందు సేవించి మృతి చెందినట్లు స్థానిక పోలీసులు తెలియజేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. 2017 వ సంవత్సరంలో కళావతి భర్త మృతి చెందనంతో అప్పటినుంచి మానసికంగా ఇబ్బందికి గురై, మతి స్థిమితం లేకుండా ప్రవర్తిస్తున్న నేపథ్యంలో.. కుమారుడు శ్రీను 32 ఏళ్ల వయసు వచ్చినప్పటికీ వివాహం చేసుకోకుండా తన తల్లికి సేవలు చూసుకుంటూ చూసుకునేవాడు. అయితే శుక్రవారం ఉదయం కుమారుడు శ్రీను ఏదో పనిపై బయటకు వెళ్లి వచ్చేటప్పటికి తన తల్లి గడ్డి మందు తాగి అపస్మార్క స్థితిలో నేలపై పడి ఉంది. వెంటనే 108 ద్వారా టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించినప్పటికీ వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు తెలిపారు. కుమారుడు శ్రీను ఇచ్చిన ఫిర్యాదు మేరకు స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిర్వహించి గ్రామానికి తీసుకొచ్చే అంత్యక్రియలు నిర్వహించారు.

## సీ ఈ వో “కలమట” పదవి విరమణ సభ



మెళియాపుట్టి, శివ సూర్య, జులై 31: మెళియాపుట్టి మండలం కోసమాల కో ఆపరేటివ్ సొసైటీ సీఈఓ కలమట వాసు నాయుడు పదవీ విరమణ సభ శుక్రవారం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కోసమాల పిఎసిఎస్ చైర్మన్ సలాన మోహన్ రావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ



సందర్భంగా సీఈఓ ని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ.... కలమట వాసు నాయుడు సహకార రంగంలో అందించిన విశిష్ట సేవలను కొనియాడారు. రైతుల అభ్యున్నతి, సహకార సంఘాల అభివృద్ధి, సభ్యులకు మెరుగైన సేవలు అందించడంలో ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని ప్రశంసించారు. అనంతరం శాలువాతో సన్మానించి, జ్ఞాపికను అందజేసి ఘనంగా సత్కరించారు. పదవీ విరమణ అనంతరం కూడా ఆయన ఆరోగ్యంగా,ఆనందంగా జీవించాలని హృదయపూర్వకంగా ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జ్ సీఈఓ అనూష, సొసైటీ ముఖ్య సలహాదారులు సలాన వినోద్ కుమార్, రవి, తిరుపతి రావు , వివిధ కో ఆపరేటివ్ సొసైటీల సీఈఓలు, డీసీసీబీ బ్యాంక్ శాఖ మేనేజర్, సిబ్బంది, డీఆర్ కార్యాలయ సిబ్బంది, అలాగే పలువురు సహకార సంఘ ప్రతినిధులు, ఉద్యోగులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవ ఏర్పాట్లపై సమీక్ష సమావేశం లో

శాసనసభ్యులు మామిడి గోవిందుడు

---ఆగస్టు 1 వ తేదీన ప్రధాని నరేంద్ర మోదీ పర్యటన విజయవంతానికి సమన్వయంతో పనిచేయాలి



మెళియాపుట్టి, శివ సూర్య, జులై 31: భోగాపురంలో అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవ ఏర్పాట్లపై నిర్వహించిన సమీక్ష సమావేశం శాసనసభ్యులు మామిడి గోవిందరావు, ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు , నియోజకవర్గ పరిశీలకులు వనమాడి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.ఈ సమీక్ష సమావేశంలో ఆగస్టు 1వ తేదీన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా జరగనున్న విమానాశ్రయం ప్రారంభోత్సవ కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను సమీక్షించారు. ప్రధానమంత్రి పర్యటన విజయవంతంగా జరిగేలా రవాణా, త్రాగునీరు, భోజనం, భద్రత, పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణతో పాటు ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు.ఉత్తరాంధ్ర ప్రజల చిరకాల స్వప్నమైన భోగాపురం అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం అందుబాటులోకి రావడం ద్వారా పారిశ్రామికాభివృద్ధి, పెట్టుబడులు, పర్యాటకం, ఉపాధి అవకాశాలు విస్తృతంగా పెరిగి ఉత్తరాంధ్ర తో పాటు రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి ఈ ప్రాజెక్టు కీలకంగా నిలవ నుందని సమావేశంలో పేర్కొన్నారు.

## భోగాపురం అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ఏర్పాట్లు పూర్తి

-- ట్రయల్ రన్ ను పర్యవేక్షించిన ఎమ్మెల్యే ఎంజీఆర్, నియోజకవర్గ పరిశీలికులు ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు -- ఐదు మండలాల బస్సు ఇన్‌చార్జిల తో ట్రయల్ రన్ నిర్వహణ -- విజయవంతమైన ప్రారంభోత్సవానికి సమన్వయం పై ఎమ్మెల్యే ఎంజీఆర్ దిశానిర్దేశం



మెళియాపుట్టి, శివ సూర్య, జులై 31: ఆగస్టు 1న జరగనున్న అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం భోగాపురంలో ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేసే దిశగా పాతపట్నం నియోజకవర్గంలో విస్తృత ఏర్పాట్లు కొనసాగుతున్నాయి.ఈ సందర్భంగా పాతపట్నం నియోజకవర్గ శాసనసభ్యులు మామిడి గోవిందరావు, కాకినాడ సిటీ శాసనసభ్యులు వనమాడి వెంకటేశ్వరరావు



(కొండబాబు) పర్యవేక్షణలో పాతపట్నం నియోజకవర్గంలోని ఐదు మండలాల బస్సు ఇన్‌చార్జిలతో ట్రయల్ రన్ నిర్వహించారు.ఈ ట్రయల్ రన్‌లో బస్సుల రాకపోకలు, ప్రయాణ సమన్వయం, ప్రయాణికుల సౌకర్యాలు, బయలుదేరే సమయాలు తదితర అంశాలను సమీక్షించి, ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా




అవసరమైన సూచనలు చేశారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరయ్యే ప్రజలు సకాలంలో, సురక్షితంగా చేరుకునేలా అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా అమలు చేయాలని బస్సు ఇన్‌చార్జిలకు దిశానిర్దేశం చేశారు.ఈ కార్యక్రమంలో పాతపట్నం నియోజకవర్గంలోని ఐదు మండలాలకు చెందిన బస్సు ఇన్‌చార్జిలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఇరానీ చాయ్ యువ
## టీ టైమ్ సెంటర్ ప్రారంభించిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్



-- శంషాబాద్ జోన్‌జూలై 31:శంషాబాద్ జోన్ జీహెచ్ఎంసీ పరిధిలో చిన్న గండు నరేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇరానీ చాయ్ యువ టీ టైమ్ సెంటర్ను రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ శుక్రవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ, ఉదయం నిద్రలేవగానే చాలామందికి




ముందుగా గుర్తుకొచ్చేది వేడివేడి చాయ్ లేదా కాఫీయేనని అన్నారు. అలాంటి నాణ్యమైన టీ సెంటర్లు ప్రజలకు మంచి సేవలందించడంతో పాటు యువతకు స్వయం ఉపాధి అవకాశాలను కూడా కల్పిస్తాయని పేర్కొన్నారు.ఉద్యోగాల కోసం మాత్రమే ఎదురు చూడకుండా యువత స్వయం ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని సూచించారు. స్వయం ఉపాధి ద్వారా వ్యక్తిగతంగా బలోపేతం కావడమే కాకుండా, మరికొందరికి ఉపాధి అవకాశాలు కల్పించే అవకాశం ఉంటుందని తెలిపారు. ఇటువంటి చిన్న వ్యాపారాలే కుటుంబాల అభివృద్ధికి, దేశ ఆర్థిక పురోగతికి బలమైన పునాదిగా నిలుస్తాయని అన్నారు.ఈ కార్యక్రమంలో గణేష్ గుప్తా, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ బండి గోపాల్ యాదవ్, సిద్ధేశ్వర్, మేకల వెంకటేష్, మహేందర్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, శ్రీధర్, కర్ణాకర్ గౌడ్, బొబ్బిలి శేఖర్ ముదిరాజ్, ప్రభాకర్, జంగయ్య, సుభాష్, శ్రీనివాస్, సురేష్, రాజు, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి .

డాక్టర్ సారియా అంజుమ్.



ఎల్లారెడ్డిపేట, వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ సారియా అంజుమ్ సూచించారు. డ్రై డే శుక్రవారం సందర్భంగా ప్రజలకు అవగాహన కల్పిస్తూ ఆమె మాట్లాడుతూ, దోమల ద్వారా మలేరియా, డెంగ్యూ, చికున్ గున్యా వంటి వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందన్నారు.కలుషిత నీటి వల్ల టైఫాయిడ్, విరేచనాలు, వైరల్ జ్వరాలు వచ్చే అవకాశాలు అధికంగా ఉంటాయని తెలిపారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. కొబ్బరి చిప్పలు, పాత టైర్లు, ఎయిర్ కూలర్లు, పాత కుండీలు తదితర వస్తువుల్లో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు పాటించాలని కోరారు.జ్వరం, తలనొప్పి, శరీర నొప్పులు వంటి లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే సమీప ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలని ప్రజలకు సూచించారు. పిల్లలు, గర్భిణీ స్త్రీలు, వృద్ధులు ఆరోగ్య విషయంలో మరింత జాగ్రత్తగా ఉండాలని తెలిపారు.ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారని, ప్రజలు ఎలాంటి ఇబ్బందులు పడకుండా వెంటనే ఆసుపత్రికి రావాలని డాక్టర్ సారియా అంజుమ్ పేర్కొన్నారు.

## నాథన్ బౌలింగ్ మెరుపు.. కీర్తన డ్రాయింగ్‌లో ప్రతిభ
## ఇన్‌ఫెంట్ జీసస్ ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థుల ద్వంద్వ విజయం

విజేతలను అభినందించిన చైర్మన్, ప్రిన్సిపాల్ ఫాదర్ అమర్ ఫ్రాన్సిస్



శంషాబాద్ జోన్‌శంషాబాద్, జూలై 31:శంషాబాద్‌లోని ఇన్‌ఫెంట్ జీసస్ ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు క్రీడలు, కళారంగాల్లో విశేష ప్రతిభ కనబరిచి మరోసారి పాఠశాలకు ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చారు. గోవాలో నిర్వహించిన అండర్--16 టీ20 క్రికెట్ ఛాంపియన్‌షిప్--2026లో తెలంగాణ జట్టుకు ప్రాతినిధ్యం వహించిన విద్యార్థి ఈ. నాథన్ తన అద్భుత బౌలింగ్‌తో ఆకట్టుకోగా, తెలంగాణ ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించిన టెక్నికల్ సర్టిఫికేట్ కోర్స్ (డ్రాయింగ్) పరీక్షలో విద్యార్థిని కీర్తన ప్రతిభ కనబర్చి సర్టిఫికేట్ సాధించింది.టోర్నీలో ఈ. నాథన్ అద్భుత బౌలింగ్ ప్రదర్శనతో అందరి ప్రశంసలు అందుకున్నాడు. మహబూబ్‌నగర్ జట్టుతో జరిగిన మ్యాచ్‌లో కేవలం 7 పరుగులు మాత్రమే ఇచ్చి 4 వికెట్లు పడగొట్టి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. అనంతరం తొండపల్లి బ్రదర్స్ అకాడమీతో జరిగిన మ్యాచ్‌లోనూ మరో నాలుగు వికెట్లు సాధించి తన ప్రతిభను మరోసారి నిరూపించాడు. టోర్నీ మొత్తం నిలకడైన ప్రదర్శన కనబరిచిన నాథన్‌ను కోచ్‌లు, క్రీడాభిమానులు అభినందించారు.మరోవైపు విద్యార్థిని కీర్తన తెలంగాణ ప్రభుత్వ నిర్వహించిన టెక్నికల్ సర్టిఫికేట్ కోర్స్ (డ్రాయింగ్) పరీక్షలో ఉత్తీర్ణత సాధించి తన చిత్రలేఖన నైపుణ్యాన్ని చాటుకుంది. సృజనాత్మకత, కళాత్మక ప్రతిభతో ఈ విజయాన్ని సొంతం చేసుకుని పాఠశాలకు మరో గౌరవాన్ని తీసుకొచ్చింది.ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్, ప్రిన్సిపాల్ ఫాదర్ అమర్ ఫ్రాన్సిస్, ఫాదర్ కిషోర్ విజేతలను అభినందించారు. విద్యార్థులు విద్యతో పాటు క్రీడలు, కళారంగాల్లోనూ రాణించడం పాఠశాలకు గర్వకారణమని పేర్కొన్నారు. క్రమశిక్షణ, అంకితభావంతో ముందుకు సాగితే రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మరిన్ని విజయాలు సాధించవచ్చని ఆకాంక్షించారు.విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి అన్ని రంగాల్లో ప్రోత్సహించేందుకు ఇన్‌ఫెంట్ జీసస్ ఇంటర్నేషనల్ స్కూల్ ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తోందని తెలిపారు. నాథన్, కీర్తన సాధించిన విజయాలు ఇతర విద్యార్థులకు స్ఫూర్తిగా నిలుస్తాయని, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు, తెలంగాణ రాష్ట్రానికి మరింత గౌరవం తీసుకురావాలని ఆకాంక్షించారు.

## పెద్ది సుదర్శన్ రెడ్డికి బీఆర్ఎస్ పార్టీ ఘన నివాళి.



ఎల్లారెడ్డిపేట, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే, సీనియర్ రాజకీయ నాయకులు పెద్ది సుదర్శన్ రెడ్డి ఆకస్మిక గుండెపోటుతో మృతి చెందడం పట్ల రాజన్న సిరిసిల్ల జిల్లా బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని తెలంగాణ భవన్‌లో పెద్ది సుదర్శన్ రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి బీఆర్ఎస్ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. అనంతరం తోట ఆగయ్య మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమంలో పెద్ది సుదర్శన్ రెడ్డి పోషించిన కీలక పాత్రను, ఉద్యమ విజయానికి అందించిన సేవలను, పార్టీ బలోపేతానికి చేసిన కృషిని స్మరించుకున్నారు.వారి నిరాడంబర నాయకత్వం, ప్రజాసేవ పట్ల అంకితభావం, ఉద్యమంలో మిగిల్చిన చిరస్మరణీయ జ్ఞాపకాలు ఎల్లప్పుడూ కార్యకర్తలకు స్ఫూర్తిగా నిలుస్తాయని కొనియాడారు. పెద్ది సుదర్శన్ రెడ్డి మృతి పార్టీకి తీరని లోటని పేర్కొంటూ, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, రాష్ట్ర నాయకుడు గూడూరి ప్రవీణ్, సెస్ డైరెక్టర్లు వర్స కృష్ణహరి, దార్నాం లక్ష్మీనారాయణ, ప్యాక్స్ ఛైర్మన్లు గుండారపు కృష్ణారెడ్డి, బండి దేవదాస్, పార్టీ నాయకులు కుంబాల మల్లారెడ్డి, గజభింకర్ రాజన్న, ఆకుల చిన్న, సంపత్, హరీష్, శ్రీనివాస్, అక్రమ్ అశోక్ రావు, సత్యనారాయణ, అజయ్, బాలకిషన్ తదితరులు పాల్గొని పెద్ది సుదర్శన్ రెడ్డికి ఘనంగా నివాళులర్పించారు.

## పాఠశాలల్లో మధ్యాహ్న
## భోజనంను పరిశీలించిన సర్పంచ్ అందె సుభాష్.



ఎల్లారెడ్డిపేట, ఎల్లారెడ్డిపేట మండలంలోని రాచర్ల తిమ్మాపూర్ గ్రామంలో శుక్రవారం జెడ్పీహెచ్ఎస్, ఎంపీపీఎస్ పాఠశాలల్లో సర్పంచ్ అందె సుభాష్ మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు.ఈ సందర్భంగా విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన భోజనం అందించాలని, కూరగాయలతో కూడిన పోషకాహారం తప్పనిసరిగా వడ్డించాలని మధ్యాహ్న భోజన సిబ్బందికి సూచించారు. విద్యార్థుల ఆరోగ్యం, పోషకాహారం విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి జి. రవి, అంగన్‌వాడీ టీచర్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు. విద్యార్థులకు మెరుగైన భోజన వసతులు కల్పించేందుకు గ్రామ పంచాయతీ తరఫున అవసరమైన సహకారం అందిస్తామని సర్పంచ్ తెలిపారు.

## బొప్పాపూర్ లోఇల్లు కూలిన
## బాధితురాలికి భరోసా ఇచిన ఎమ్మార్వో సుజాత.



ఎల్లారెడ్డిపేట గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల మూలంగా ఎల్లారెడ్డి పేట మండలం రాచర్ల బొప్పాపూర్ గ్రామంలో అల్లాడి డి విజయకు చెందిన ఇల్లు కూలిపోయిన విషయం తెలిసి ఎమ్మార్వో సుజాత ఆ ఇంటిని శుక్రవారం గ్రామాన్ని సందర్శించారు.ఒంటరిగా జీవిస్తున్న తన ఇల్లు కూలిందని తీవ్రంగా రోదించినబాధితురాలు విజయను తహసీల్దార్ సుజాతను పరామర్శించారు. "ప్రభుత్వం మీకు అండగా ఉంటుందనీ, తనను అన్ని విధాలుగా ఆదుకుంటాం అని, ఎలాంటి ఆందోళన చెందవద్దు అంటూ ధైర్యం చెప్పి బాధితురాలికి భరోసా ఇచ్చారు.కూలిన ఇంటి నష్టం వివరాలను పరిశీలించి, ప్రభుత్వ పరంగా అందించాల్సిన



సహాయంపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఇల్లందుల గీతాంజలి శ్రీనివాస్ రెడ్డి, ఉపసర్పంచ్ కొండాపురం వెంకట్ రెడ్డి, కార్యదర్శి సంతోష్, జీపీఓ అంజమ్మ, ఆర్ఐ, వార్డు సభ్యులు పోచంపల్లి మంగ, చల్ల పద్మారెడ్డి, కొత్త ప్రసాద్, నిరటి భాను, ఏలూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## పెద్ది సుదర్శన్ రెడ్డికి బీఆర్ఎస్ నాయకుల ఘన నివాళి.



ఎల్లారెడ్డిపేట, తెలంగాణ ఉద్యమకారుడు, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు పెద్ది సుదర్శన్ రెడ్డి గుండెపోటుతో ఆకస్మికంగా మృతి చెందడం పట్ల ఎల్లారెడ్డిపేట మండల బీఆర్ఎస్ నాయకులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. తెలంగాణ ఉద్యమంలో ఆయన చేసిన సేవలను నాయకులు స్మరించుకున్నారు. పార్టీకి, ప్రజలకు ఆయన అందించిన సేవలు



చిరస్మరణీయమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో తిమ్మాపూర్ సర్పంచ్ అందే సుభాష్, అల్మాస్పూర్ ఉపసర్పంచ్ కొర్రి అనిల్, ధర్మ గౌడ్, మాజీ సర్పంచ్ మాలోతు పుణ్య నాయక్, మునిగే ప్రమోద్, ఘనగోనిబంటి, కొర్రి ఆశీర్వాదం, ముత్యాల బాలరాజ్, గణపతి, పీరియా గోపాల్ తదితరులు పాల్గొని నివాళు లర్పించారు.

## విద్యార్థుల కోసం ప్రతి స్టేజ్ వద్ద
## బస్సులు ఆపాలి : డిపో మేనేజర్‌కు బీఆర్ఎస్వీ వినతి.



ఎల్లారెడ్డిపేట, . ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న విద్యార్థులు కళాశాలకు రావడంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బీఆర్ఎస్వీ విద్యార్థి విభాగం నాయకులు తెలిపారు.గజసింగవరం స్టేజ్, తిమ్మాపూర్ స్టేజ్, సముద్రలింగాపూర్ స్టేజ్ వద్ద విద్యార్థులు బస్సుల కోసం వేచి ఉన్నప్పటికీ ఆర్టీసీ బస్సులు ఆపడం లేదని వారు ఆరోపించారు. దీంతో విద్యార్థులు సమయానికి కళాశాలకు చేరుకోలేకపోతున్నారని, హాజరు మరియు చదువుపై ప్రభావం పడుతోందని పేర్కొన్నారు.ఈ సమస్యను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం రాజన్న సిరిసిల్ల జిల్లా డిపో మేనేజర్‌కు బీఆర్ఎస్వీ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. కళాశాల విద్యార్థుల సౌకర్యార్థం ప్రతి స్టేజ్ వద్ద బస్సులు తప్పనిసరిగా ఆపేలా చర్యలు తీసుకోవాలని కోరారు.విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ఆర్టీసీ అధికారులు తక్షణమే స్పందించి సమస్యను పరిష్కరించాలని బీఆర్ఎస్వీ నాయకులు డిమాండ్ చేశారు.

## రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు
## ఎంపికైన గొల్లపల్లి క్రీడాకారులకు సర్పంచ్ అభినందనలు.




ఎల్లారెడ్డిపేట ఈషా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన క్రీడా పోటీల్లో జిల్లా స్థాయిలో విజయం సాధించి రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైన గొల్లపల్లి గ్రామ క్రీడాకారులను సర్పంచ్ కొండ రమేష్ గౌడ్ అభినందించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రస్థాయి పోటీల్లో కూడా విజయం సాధించి గొల్లపల్లి గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని, జాతీయస్థాయిలో గ్రామాన్ని నిలబెట్టాలని ఆకాంక్షించారు. క్రీడాకారులు క్రమశిక్షణతో సాధన చేసి ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు.రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనడానికి వెళ్లనున్న 11 మంది క్రీడాకారులకు తన సొంత ఖర్చులతో టీ-షర్టులను అందజేస్తానని సర్పంచ్ రమేష్ గౌడ్ హామీ ఇచ్చారు. గ్రామ యువత క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవడం అభినందనీయమని ఆయన పేర్కొన్నారు.

## ఆగస్టు చివరి వారంలో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణాలకు శ్రీకారం
## టెండర్ ప్రక్రియ ప్రారంభం.. నిర్మాణాలకు సిద్ధమైన ప్రభుత్వం



హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ టవర్స్ పథకం కింద తొలి విడత గృహ నిర్మాణ పనులను ఆగస్టు చివరి వారంలో ప్రారంభించనున్నట్లు రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార ఒ పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు.శుక్రవారం సచివాలయంలో మీడియా ప్రతినిధులతో మాట్లాడిన మంత్రి గారు ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి సంబంధించిన టెండర్ ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైందని, అది పూర్తికాగానే పనులు ప్రారంభించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వెల్లడించారు. హైదరాబాద్ నగరంలోని క్యూర్ పరిధిలో లక్ష ఇళ్ల నిర్మాణమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఇందులో భాగంగా ప్రయోగాత్మకంగా తొలి విడతలో 16 నియోజకవర్గాల్లో ఒక్కో నియోజకవర్గానికి 500 చొప్పున మొత్తం 8 వేల ఇళ్ల నిర్మాణాన్ని చేపడుతున్నామని తెలిపారు. ఇప్పటికే ఈ 16 నియోజకవర్గాలతో పాటు మరో నాలుగు నియోజకవర్గాల్లో కూడా స్థలాల గుర్తింపు పూర్తయిందని, దశలవారీగా మొత్తం లక్ష ఇళ్ల నిర్మాణాన్ని విస్తరిస్తామని చెప్పారు. పేద కుటుంబాలు కూడా హైదరాబాద్‌లోని అభివృద్ధి చెందిన ప్రాంతాల్లో గౌరవప్రదమైన జీవితం గడపాలన్నదే ప్రభుత్వ సంకల్పమని మంత్రి స్పష్టం చేశారు. ఈ లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు వస్తే కొన్ని రాజకీయ పార్టీలు దుష్ప్రచారం చేసినప్పటికీ ప్రజలు వాటిని నమ్మలేదని, ప్రస్తుతం భారీగా వస్తున్న దరఖాస్తులే ఇందిరమ్మ టవర్స్‌పై ప్రజల విశ్వాసానికి నిదర్శనమని అన్నారు. ప్రభుత్వానికి చెందిన వందల కోట్ల రూపాయల విలువైన భూముల్లో టవర్స్ నిర్మించి, ప్రతి లబ్ధిదారునికి 20 నుంచి 22 గజాల అన్‌డివైడెడ్ షేర్‌ను ఉచితంగా వారి పేరుమీద రిజిస్ట్రేషన్ చేస్తామని తెలిపారు. భూమి విలువతో కలిపి ఒక్కో ఫ్లాట్ మార్కెట్ విలువ రూ.40 లక్షల నుంచి రూ.60 లక్షల వరకు ఉంటుందని చెప్పారు. ఫలక్‌నుమా ప్యాలెస్ సమీపంలో కూడా ఇందిరమ్మ టవర్స్ నిర్మాణం చేపడుతున్నామని వెల్లడించారు.పేదల జీవనోపాధికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నియోజకవర్గాన్ని యూనిట్‌గా తీసుకుని ఇళ్ల కేటాయింపు, నిర్మాణం చేపడుతున్నామని, అందువల్ల ఏ నియోజకవర్గానికి చెందిన వారు ఆ నియోజకవర్గంలోనే దరఖాస్తు చేసుకోవాలని మంత్రి సూచించారు. దరఖాస్తుదారులు నివాస ధృవీకరణ కోసం ఆధార్ కార్డు మాత్రమే కాకుండా ఓటర్ ఐడీ, డ్రైవింగ్ లైసెన్స్, బ్యాంక్ పాస్‌బుక్ వంటి పత్రాలను కూడా సమర్పించవచ్చని మంత్రి తెలిపారు. దీంతో ప్రజలు అనవసర ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.దరఖాస్తుల గడువును ఎట్టి పరిస్థితుల్లోనూ పొడిగించే ఆలోచన లేదని, ఆగస్టు 10లోపు తప్పనిసరిగా దరఖాస్తులు పూర్తి చేయాలని మంత్రి స్పష్టం చేశారు.ఇంటి కోసం చెల్లించే రూ.10 వేల ఈఎండీ విషయంలో ఎలాంటి అపోహలకు గురికావద్దని, అర్హత లభించని వారికి వంద శాతం మొత్తం తిరిగి చెల్లిస్తామని మరోసారి స్పష్టం చేశారు. యూపీఐ లేదా నెట్ బ్యాంకింగ్ ద్వారా ఈఎండీ చెల్లిస్తే, అదే బ్యాంకు ఖాతాకు నేరుగా రీఫండ్ జమ అవుతుందని స్పష్టం చేశారు. ఈ ప్రభుత్వం ప్రజా ప్రయోజనాల విషయంలో పారదర్శకత, బాధ్యతతో ముందుకు సాగుతుందని, ఏ నిర్ణయం తీసుకున్నా ప్రజలకు మేలు జరిగేలా, దీర్ఘకాల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని అమలు చేస్తోందన్నారు. ఎవరి పట్లా కక్షపూరిత వైఖరి లేకుండా, సామాన్య ప్రజలు హర్షించే సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలనే ప్రభుత్వం చేపడుతోందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు.

## ప్రపంచ స్నేహితుల దినోత్సవ వేడుకలు
## అత్తాపూర్ యోగ సెంటర్ ఎబిసి లాఫింగ్ క్లబ్

అత్తాపూర్/ హైదరగూడరాజేంద్ర నగర్ డివిజన్

హైదరాబాద్.లక్ష్మీ నగర్ పార్కులో ఘనంగా ప్రపంచ స్నేహితుల దినోత్సవం స్నేహం ధైర్యాన్ని ఆత్మవిశ్వాసాన్ని ఇస్తుందిప్రముఖ పత్రికా రచయిత కాలమిస్ట్ తెలంగాణ ఎకనామిక్ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు నేదునూరి కనకయ్య. స్నేహాని కన్న మిన్న లోకానమరేది లేదురా నిజమైన స్నేహం మనిషికి ధైర్యాన్ని స్థైర్యాన్ని ఆత్మవిశ్వాసాన్ని త్యాగశీలతను అలవరుస్తుందని.స్నేహం మార్కెట్లో కొంటె దొరకదని ప్రముఖ పత్రిక రచయిత కాలమిస్ట్ తెలంగాణ ఎకనామిక్ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు నేదునూరి కనకయ్య అన్నారు.నేడు ప్రపంచ స్నేహితుల దినోత్సవ వేడుకలు సందర్భంగా అత్తాపూర్ యోగా సెంటర్ ఆధ్వర్యంలో అత్తాపూర్ లోని లక్ష్మీ నగర్ పార్కులో స్నేహితుల దినోత్సవ వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి.లక్ష్మీ నగర్ పార్క్ అధ్యక్షులు శ్రీ మహేందర్ గారి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి తెలంగాణ ఎకానామిక్ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు ప్రముఖ రచయిత కాలమిస్ట్ నేదునూరి కనకయ్య ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు స్నేహం యొక్క విశిష్టతను వివరిస్తూ స్వయంగా రాసిన ఒక అద్భుతమైన కవిత చదివి వినిపించారు. స్నేహబంధం లోని లోతును ఆవిష్కరించిన ఆయన కవిత అక్కడికి వచ్చిన వారందరిని ఎంతగానో ఆలోచింపజేసింది.కార్యక్రమంలో పాల్గొన్న అత్తాపూర్ యోగా సెంటర్ గురువు మహేందర్ మాట్లాడుతూ నిత్య జీవితంలో ఒత్తిడిని జయించ డానికి యోగతో పాటు మంచి స్నేహితుల తోడ్పాటు నవ్వు ఎంతో అవసరం అన్నారు. ప్రముఖ విద్యావేత్తలకు ఘన సన్మానం గత నాలుగు దశాబ్దాలుగా (40 ఏళ్ళుగా) బోధనా రంగంలో విశేష సేవలు చేసివిద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిన ఆర్థికవేత్త తెలంగాణ ఎకనామిక్ ఫోరం అధ్యక్షులు నేదునూరి కనకయ్య గారిని రిటైర్డ్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ మహోహార రావు గారినిఅత్తాపూర్ యోగా సెంటర్ గురువు లక్ష్మీ నగర్ పార్క్ అధ్యక్షులు పి'మహేందర్ మరియు యోగా సెంటర్ సభ్యులు ఏబీసీ లాఫింగ్ క్లబ్ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు పూలమాల శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ వేడుకల్లో అత్తాపూర్ యోగా సెంటర్ సభ్యులు ఏబీసీ లాఫింగ్ క్లబ్ సభ్యులు శ్రీమతి సరిత కుమారి శ్రీమతి విజయశ్రీ శ్రీమతి అనురాధ లక్ష్మి చంద్రారెడ్డి ప్రభాకర్ వెంకటపతి రాజు నేదునూరి కనకయ్య పంచాక్షేశ్వరరావు పి మహేందర్ డాక్టర్ మనోహరావ్ ఎన్ ప్రభాకర్ రావు రాంమోహన్ రావు వెంకటరెడ్డి కల్కి మూర్తి బ్రహ్మయ్య నాయుడు రవి ప్రసాద్ చిన్న విజయ్ తదితరులు హాజరయ్యారు.అత్తాపూర్ లక్ష్మీ నగర్ పార్కులో జరిగిన స్నేహితుల దినోత్సవ వేడుకల్లో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ప్రముఖ పత్రికా రచయిత కాలమిస్ట్ తెలంగాణ ఎకనామిక్ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు నేదునూరి కనకయ్య మనోహరరావు లను అత్తాపూర్ యోగ సెంటర్ గురువు పి మహేందర్ గారిని సన్మానిస్తున్నఅత్తాపూర్ యోగా సెంటర్ ఏ బి సి లాఫింగ్ క్లబ్ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు.ఇట్లునేదునూరి కనకయ్య అడ్వైసర్అత్తాపూర్ యోగ సెంటర్హైదరాబాద్9440245771

## శ్రీరామ్ నగర్ కాలనీలోని శ్రీ సీతారామ స్వామి దేవాలయంలో జరిగిన శాకాంబరి ఉత్సవాల్లో ఆలయ కమిటీ పిలుపు మేరకు యాదవ కార్పొరేషన్ చైర్మన్ రఘునాథ్ యాదవ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు!



శేరిలింగంపల్లి: జులై 31 ఈ సందర్భంగా కమిటీ సభ్యులు చైర్మన్ కి అతిథి సత్కారం చేశారుఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు ఎల్లారెడ్డి, శేర్లింగంపల్లి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు బలరామ్ యాదవ్, రాజమోహన్ రావు, ఓబుల్ రెడ్డి, నాగరాజు యాదవ్, వెంకటేశ్వర్లు, వెంకటరామయ్య, అనంత రెడ్డి, సన్నీ యాదవ్ మరియు ఇతర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## తల్లిదండ్రుల స్వప్నాన్ని నెరవేర్చిన తనయుడు మట్టిలో మాణిక్యం అయోధ్య విద్యా కుసుమం ఉదయ్ కిరణ్

కోవెంటరీ యూనివర్సిటీ ద్వారా మాస్టర్ డిగ్రీ పట్టా పందిన అయోధ్య వాసి



31 జూలై మహబూబాబాద్ అర్బన్ సాధించాలనే తపన ఉంటే ఎటువంటి భిన్న పరిస్థితులు అడ్డు రావని ఒక మారుమూల గ్రామ ప్రాంతవాసి రైతు కుటుంబంలో జన్మించిన అబ్బాయి తన సత్తాతో తల్లిదండ్రుల లక్ష్యాన్ని నెరవేర్చాడు మహబూబాబాద్ మండలం అయోధ్య గ్రామానికి చెందిన గునిగంటి అశోక్ కవిత దంపతుల ప్రథమ పుత్రుడు గునిగంటి ఉదయ్ కిరణ్ మానుకోట జిల్లా కేంద్రంలోని ఒక ప్రైవేటు పాఠశాలలో ప్రాథమిక విద్యను అభ్యసించి ఇంటర్ మరియు బిటెక్ సికింద్రాబాద్ లో పూర్తి చేయగా అనంతరం ఇంగ్లాండ్ లో కోవంట్రి విశ్వవిద్యాలయంలో మాస్టర్స్ డిగ్రీ ఇన్ డేటా సైన్స్ అండ్ కంప్యూటేషనల్ ఇంటిలిజెంట్స్ కోర్సు కు గాను మాస్టర్స్ డిగ్రీ పూర్తి చేయడంతో తల్లిదండ్రుల ఆనందం అద్భుతం అని అనవచ్చు ఈ సందర్భంగా మారుమూల ప్రాంతం నుండి విదేశాలలో పట్టా పొందడం ద్వారా బంధువులలో గ్రామస్తులలో ఆనందానికి అవధులు లేకుండా పోయింది ఈ సందర్భంగా తాతయ్య నానమ్మ గునిగంటి వెంకటయ్య లక్ష్మి మరియు తన ఇతర బంధుమిత్రులు ఆనందం వ్యక్తం చేసి ఉదయ్ కిరణ్ కు శుభాకాంక్షలు తెలియజేశారు ఇంతవరకు ఈ గ్రామంలో ఎవరు సాధించలేని ఘనత తను సాధించడంతో అయోధ్య గ్రామంలో ఇట్టు తన కుటుంబంలో ఆనంద భాష్పాలు వచ్చాయి

## ఉచిత పోలీస్ కానిస్టేబుల్, ఎస్ఐ కోచింగ్ ప్రవేశ (స్క్రీనింగ్) పరీక్షకు తప్పనిసరిగా హాజరుకావాలి

అభ్యర్థులకు జిల్లా ఎస్పీ డా. శబరీష్ విజ్ఞప్తి



31 జూలై మహబూబాబాద్ అర్బన్ మహబూబాబాద్ జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పోలీస్ కానిస్టేబుల్, సబ్-ఇన్‌స్పెక్టర్ (ఎస్ఐ) ఉద్యోగాల కోసం నిర్వహిస్తున్న ఉచిత కోచింగ్ కార్యక్రమానికి ప్రవేశ (స్క్రీనింగ్) పరీక్ష ఆగస్టు 2, 2026 (ఆదివారం) ఉదయం 10.00 గంటల నుండి మధ్యాహ్నం 1.00 గంటల వరకు నిర్వహించబడుతుందిఅభ్యర్థుల సౌకర్యార్థం మహబూబాబాద్ పట్టణంలో మూడు, తొర్రూరులో ఒకటి చొప్పున మొత్తం నాలుగు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ డా. శబరీష్ తెలిపారు.పోలీస్ స్టేషన్ల వారీగా పరీక్షా కేంద్రాల కేటాయింపు1. మహర్షి విద్యాలయం, కేసముద్రం రోడ్, మహబూబాబాద్మహబూబాబాద్ టౌన్మహబూబాబాద్ రూరల్ కేసముద్రం2. శ్రీ చైతన్య టెక్నో స్కూల్, పీఎస్ఆర్ కన్వెన్షన్ సమీపంలో, మహబూబాబాద్ఇనుగుర్తి కొత్తగూడ గంగారంగూడూరు3. శ్రీ చైతన్య హై స్కూల్, రైల్వే గేట్ సమీపంలో, మహబూబాబాద్ కురవిడోర్నకల్ బయ్యారంగార్ల సీరోలుచిన్నగూడూరు 4. తొర్రూరు సబ్-డివిజన్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్ల అభ్యర్థులకు సమత డిగ్రీ కళాశాల, వెలికట్టె, తొర్రూరు ఇప్పటికే తమ పేర్లు నమోదు చేసుకున్న అభ్యర్థులు తమ పోలీస్ స్టేషన్‌కు కేటాయించిన పరీక్షా కేంద్రంలో ఉదయం 9.30 గంటలలోపు తప్పనిసరిగా చేరుకోవాలని జిల్లా ఎస్పీ సూచించారు. పరీక్షా కేంద్రాల్లోకి అభ్యర్థులను ఉదయం 8.30 గంటల నుండి అనుమతిస్తారు. పరీక్ష సమయానికి ఆలస్యంగా వచ్చే అభ్యర్థులకు ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉన్నందున అందరూ నిర్ణీత సమయానికి ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని సూచించారుపరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు నలుపు (బ్లాక్ ) బాల్ పాయింట్ పెన్ మాత్రమే వెంట తీసుకురావాలని, మొబైల్ ఫోన్లు, స్మార్ట్ వాచ్‌లు, బ్లూటూత్ పరికరాలు, ఇయర్ ఫోన్లు, కాలిక్యులేటర్లు తదితర ఎలక్ట్రానిక్ గాడ్జెట్లు పరీక్షా కేంద్రంలోకి అనుమతించబడవని స్పష్టం చేశారు. పరీక్షా కేంద్రంలో నిర్వహణ సిబ్బంది సూచనలను ప్రతి అభ్యర్థి తప్పనిసరిగా పాటించాలని కోరారురవాణా సౌకర్యం అవసరమైన అభ్యర్థులు తమ సంబంధిత పోలీస్ స్టేషన్‌ను సంప్రదించవచ్చు. అవసరాన్ని బట్టి ఆయా పోలీస్ స్టేషన్ల నుండి పరీక్షా కేంద్రాలకు వాహనాల ఏర్పాటు చేయబడుతుందని తెలిపారుజిల్లా పోలీస్ శాఖ అందిస్తున్న ఈ ఉచిత కోచింగ్ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని స్క్రీనింగ్ పరీక్షలో ఉత్తమ ప్రతిభ కనబరిచి పోలీస్ శాఖలో ఉద్యోగాలు సాధించాలని జిల్లా ఎస్పీ డా. శబరీష్ ఆకాంక్షించారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులందరికీ ఆయన హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

## ప్రైవేటు హాస్పిటల్ రికార్డుల పరిశీలన పూర్తి




మహబూబాబాద్ అర్బన్ జూలై.31శుక్రవారం క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ ప్రైవేట్ ఆసుపత్రుల రెన్యువల్స్, రిజిస్ట్రేషన్ సమావేశం జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ ఐఏఎస్ గారి ఆదేశాలతో జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో ఇంచార్జ్ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పురుషోత్తం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిస్టిక్ రిజిస్ట్రేషన్ అథారిటీ కమిటీ సభ్యులు ప్రైవేట్ ఆస్పత్రిలో మున్సిపల్ టాక్స్ మరియు పార్కింగ్, ప్రతి ప్రైవేట్ ఆస్పత్రిలో డాక్టర్ల ధ్రువీకరణ పత్రాలను, రెన్యువల్స్ ఆసుపత్రులు 3, ప్రైవేట్ ఆస్పత్రిల పర్మినెంట్ రిజిస్ట్రేషన్12 రికార్డులను పరిశీలించి ధ్రువీకరించారు ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి రవి రాథోడ్, డి.ఎస్.పి తిరుపతి రావు ఐఎంఏ ప్రెసిడెంట్ డాక్టర్ జగదీశ్వర్, పాల్గొన్నారు

# పేదల ప్రజల కోసం ఎంతదూరమైనా వెళ్లేందుకు సిద్ధం... ప్రజలను ఇబ్బందిపెట్టే అధికారులను ఉపేక్షించేదిలేదు...

ప్రతి 45రోజులకు పథకాల అమలుపై సమీక్ష జరగాలి...

నిధుల సమస్య తలెత్తకుండా చూసే బాధ్యత నాది... ఎక్కడికక్కడ సమస్యలు పరిష్కరమయ్యేలా కృషి చేయాలి...

ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి... యాచారం, అబ్దుల్లాపూర్ మెట్ మండలాల్లో వరుస సమీక్షలు...

అన్నిశాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో సాగాలని నిర్దేశం...




ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాల అమలుతీరు, అభివృద్ధి కార్యక్రమాలపై ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి గారు వరుస సమీక్షలు నిర్వహించారు. శుక్రవారం ఉదయం అబ్దుల్లాపూర్ మెట్ మండలానికి చెందిన అధికారులు, ప్రజాప్రతినిధులతో ఆయన సమీక్ష నిర్వహించారు. మధ్యాహ్నం యాచారం మండల పరిషత్ కార్యాలయానికి వెళ్లిన ఎమ్మెల్యే... మండలానికి చెందిన వివిధశాఖల అధికారులు, సర్పంచ్ లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలు, క్షేత్రస్థాయిలో అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. సర్పంచ్ లు తన దృష్టికి తీసుకువచ్చిన పలుసమస్యలపై ఆరాతీసిన మల్ రెడ్డి రంగారెడ్డి.... సంబంధిత అధికారులతో చర్చించారు. సమస్యలు లేని గ్రామాల నిర్మాణానికి చేపట్టాల్సిన కార్యాచరణ గురించి ఒక్కో శాఖ అధికారిని అడిగి తెలుసుకున్నారు. భూసమస్యలు, ఆక్రమణలు, అక్రమంగా అనుమతుల విషయంలో పలుసూచనలు చేశారు. అధికారులెవరికీ తలొగ్గవద్దని చెప్పిన ఎమ్మెల్యే... దోపిడి, కబ్జాలను సహించే ప్రసక్తేలేదని స్పష్టం చేశారు. ఊళ్లో పుట్టి పెరిగిన తనకు పేదల సమస్యలన్నీతెలుసునన్న మల్ రెడ్డి రంగారెడ్డి.... వారి కోసమే నిరంతరం తొర్రూర్ లో అందరికీ అందుబాటులో ఉంటున్నట్లు చెప్పారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు రోజూ వేలాది మంది తన వద్దకు వస్తుంటారన్న ఆయన... క్షేత్రస్థాయిలోనే అధికారులు సమస్యలకు పరిష్కారం చూపితే వారికి అక్కడి వరకు వచ్చే పని ఉండదని చెప్పారు. ప్రభుత్వ పథకాల అమలుతీరుపై ప్రతీ 45రోజులకోసారి సమీక్ష చేయాల్సి ఉంటుందన్న ఎమ్మెల్యే... సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందినప్పుడే ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుందన్నారు. ఆ బాధ్యత అధికార యంత్రాంగంపైనే ఉంటుందని చెప్పారు.ప్రజలను ఇబ్బందిపెట్టే అధికారులు ఎవరైనా సహించే ప్రసక్తేలేదని హెచ్చరించిన మల్ రెడ్డి... ఇటీవల యాచారం మండలంలో ఓ అధికారి తీరును ప్రస్తావించారు. యాచారం మండలంలో భూసేకరణతో నష్టపోయిన రైతులందరికీ న్యాయం జరుగుతుందని ఈ సందర్భంగా ఎమ్మెల్యే మల్ రెడ్డి హామీ ఇచ్చారు. పరిహారం పెంపు విషయంపై ముఖ్యమంత్రితో ప్రత్యేకంగా చర్చించినట్లు చెప్పారు. రైతులను అడ్డం పెట్టుకుని గతంలో డబ్బులు వసూలు చేసిన వారందరినీ బయటికి తీయకతప్పదని హెచ్చరించారు. ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకునేలా పనిచేస్తున్నామన్న మల్ రెడ్డి రంగారెడ్డి... ఇందుకు ప్రతి అధికారి సహకరించాలని చెప్పారు. అభివృద్ధికి నిధుల గురించి ఆందోళన అవసరంలేదని... కావాల్సిన నిధులను తెచ్చే బాధ్యతన తనదని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఇబ్రహీంపట్నం చెరువు సుందరీకరణ, ఆస్పత్రి నిర్మాణం, రోడ్లకు 338కోట్ల రూపాయలు మంజూరు చేయించిన అంశాలను ఉదాహరించారు. అభివృద్ధి చేయలేని వారు మాటలు మస్తుగా మాట్లాడుతుంటారని, పదేళ్లలో పనులు ఎందుకు చేయలేకపోయారో ప్రశ్నించాలని మల్ రెడ్డి రంగారెడ్డి సూచించారు. పలువురు సర్పంచులు లేవనెత్తిన అంశాలకు సమాధానమిచ్చిన ఎమ్మెల్యే... ప్రతీగ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు తాను చేస్తున్న కృషిలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు.




# సంక్షోభంలో బత్తాయి సాగు.... అస్థిత్వం కోసం నల్గొండ రైతు పోరాటం

ఒకప్పుడు దేశానికే దిక్సూచిగా నిలిచిన నల్గొండ బత్తాయి... నేడు విధానపరమైన వైఫల్యాలు, మార్కెట్ దోపిడీ, ప్రభుత్వ నిర్లక్ష్యంతో అస్థిత్వం కోసం పోరాడాల్సిన పరిస్థితి వచ్చింది ఒకప్పుడు నల్గొండ అంటే బత్తాయి... బత్తాయి అంటే నల్గొండ అనే స్థాయిలో దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన ఈ నేల నేడు తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. వేలాది రైతు కుటుంబాలకు జీవనాధారంగా, లక్షలాది వ్యవసాయ కార్మికులకు ఉపాధి వనరుగా, గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలిచిన బత్తాయి సాగు నేడు అస్తిత్వ పోరాటం చేస్తోంది. ఒకప్పుడు రైతు ఇంట్లో సిరులు కురిపించిన ఈ పంట, ఇప్పుడు అప్పులు, నష్టాలు, నిరాశలకు ప్రతీకగా మారింది.ఇది కేవలం ఒక పంట సంక్షోభం కాదు. వ్యవసాయ విధానాల్లోని లోపాలు, మార్కెట్ వ్యవస్థ వైఫల్యం, ప్రభుత్వ నిర్లక్ష్యం, రైతు పట్ల పాలకుల నిరాసక్తతకు ఇది ప్రత్యక్ష నిదర్శనం. ఒక ప్రాంత ఆర్థిక వ్యవస్థను నిలబెట్టిన పంట క్షీణిస్తుంటే, దాని ప్రభావం రైతు కుటుంబాలకే పరిమితం కాదు. గ్రామీణ జీవన విధానంపైనా, ఉపాధిపైనా, రాష్ట్ర ఉద్యాన రంగంపైనా తీవ్ర ప్రభావం చూపుతుంది.



### వైభవం నుంచి పతనం వరకు...



ఒకప్పుడు ఉమ్మడి నల్గొండ జిల్లాలో సుమారు 4.5 లక్షల ఎకరాలకు పైగా బత్తాయి సాగు విస్తరించి ఉండేది. దేశంలోనే నాణ్యమైన బత్తాయి ఉత్పత్తికి ఈ ప్రాంతం చిరునామాగా నిలిచింది. దేశంలోని పలు రాష్ట్రాలకు, విదేశాలకు కూడా ఇక్కడి నుంచి బత్తాయి ఎగుమతులు జరిగేవి.ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్షలాది మందికి ఉపాధి కల్పించిన ఈ రంగం, నేడు 40 వేల ఎకరాల లోపే పరిమితమవడం ఉద్యాన రంగానికి తీవ్రమైన హెచ్చరిక. వేలాది ఎకరాల్లో బత్తాయి తోటలు నరికివేయబడ్డాయి. రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇది ప్రకృతి సృష్టించిన సంక్షోభం కాదు... విధానాల వైఫల్యం, మార్కెట్ నిర్లక్ష్యం సృష్టించిన సంక్షోభం.

### పామాయిల్‌కు ప్రాధాన్యం... బత్తాయికి ప్రోత్సాహం ఎక్కడ?

ప్రస్తుతం ప్రభుత్వం, ఉద్యాన శాఖ పామాయిల్ సాగు విస్తరణపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాయి. కొత్త పంటలను ప్రోత్సహించడం అవసరమే. అయితే దశాబ్దాలుగా నల్గొండ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలిచిన బత్తాయి సాగు పునరుద్ధరణకు అదే స్థాయిలో ప్రాధాన్యం కనిపించడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.నాణ్యమైన మొక్కల సరఫరా, వైరస్ నియంత్రణ, శాస్త్రీయ సాగు పద్ధతులు, తోటల పునరుద్ధరణ, పరిశోధన, కోల్డ్‌చైన్, ప్రాసెసింగ్ పరిశ్రమలు, ఎగుమతి ప్రోత్సాహం వంటి అంశాల్లో సమగ్ర కార్యాచరణ లేకపోవడం సమస్యను మరింత తీవ్రతరం చేస్తోంది. ఎస్ఎల్‌బీసీ బత్తాయి మార్కెట్... ఇంకా నెరవేరని రైతు కల నల్గొండ ఎస్ఎల్‌బీసీ ప్రాంతంలో ప్రత్యేక బత్తాయి మార్కెట్ ఏర్పాటు చేసినప్పటికీ, బత్తాయి క్రయవిక్రయాలకు సంబంధించిన పూర్తి స్థాయి కార్యకలాపాలు ఇప్పటికీ ప్రారంభం కాలేదు. రైతులు ఎన్నోసార్లు ప్రభుత్వానికి, ప్రజాప్రతినిధులకు, అధికారులకు వినతిపత్రాలు ఇచ్చినా, ఆశించిన స్థాయిలో చర్యలు కనిపించలేదు.మార్కెట్ లేక రైతు ఇప్పటికీ దళారులపైనే ఆధారపడాల్సి వస్తోంది. రైతు పండించిన పంటకు ధర నిర్ణయించే హక్కు రైతుకే లేకపోవడం ఈ వ్యవస్థలోని అతిపెద్ద విషాదం. దళారుల చేతుల్లో ధరలు... నష్టాల్లో రైతులు బత్తాయి ధరను నిర్ణయించేది రైతు కాదు... దళారులే అన్న విమర్శ చాలా కాలంగా వినిపిస్తోంది. ఏడాది పొడవునా కష్టపడి పండించిన పంటకు గిట్టుబాటు ధర దక్కక రైతు నష్టాల్లో కూరుకుపోతుంటే, మధ్యవర్తులే భారీ లాభాలు ఆర్జిస్తున్నారు.పారదర్శక మార్కెట్ లేకపోవడం, నిల్వ సదుపాయాలు లేకపోవడం, ప్రాసెసింగ్ యూనిట్లు అందుబాటులో లేకపోవడం రైతును మరింత బలహీనంగా మారుస్తున్నాయి. పెరిగిన పెట్టుబడి... కూలిపోతున్న రైతు ఆర్థిక వ్యవస్థ ఎరువులు, పురుగుమందులు, కూలీల వేతనాలు, విద్యుత్, సాగునీటి, రవాణా ఖర్చులు విపరీతంగా పెరిగాయి. మరోవైపు మార్కెట్‌లో ధరలు పడిపోవడంతో రైతు ఆదాయం తగ్గిపోయింది.బ్యాంకు రుణాలు, ప్రైవేట్ అప్పులు, బంగారం తాకట్టు... ఇవే నేటి బత్తాయి రైతు జీవితాన్ని నిర్వచిస్తున్న వాస్తవాలు. పంట కంటే అప్పులే పెద్ద భారం కావడంతో అనేక మంది రైతులు తమ తోటలను నరికివేసి ఇతర పంటల వైపు వెళ్లిపోతున్నారు. వ్యవస్థ మొత్తం స్పందించాల్సిన సమయం బత్తాయి సాగును కాపాడాలంటే రైతు ఒక్కరి కృషి సరిపోదు. ప్రభుత్వం, ఉద్యాన శాఖ, వ్యవసాయ విశ్వవిద్యాలయాలు, పరిశోధనా సంస్థలు, మార్కెటింగ్ శాఖ, ప్రాసెసింగ్ పరిశ్రమలు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో ముందుకు రావాలి. తక్షణం చేపట్టాల్సిన చర్యలు – ఎస్ఎల్‌బీసీ ప్రాంతంలో పూర్తి స్థాయి సమీకృత బత్తాయి మార్కెట్‌ను వెంటనే ప్రారంభించాలి.– బత్తాయికి గిట్టుబాటు ధర భరోసా కల్పించే విధానాన్ని అమలు చేయాలి.– దళారుల ఆధిపత్యాన్ని అరికట్టి పారదర్శక మార్కెటింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయాలి.– తోటల పునరుద్ధరణకు ప్రత్యేక సబ్సిడీలు, వడ్డీలేని రుణాలు అందించాలి.– వైరస్ నియంత్రణ, అధిక దిగుబడి రకాల అభివృద్ధికి ప్రత్యేక పరిశోధన కేంద్రం ఏర్పాటు చేయాలి.– జ్యూస్ ప్రాసెసింగ్ యూనిట్లు, కోల్డ్ స్టోరేజీలు, ప్యాకింగ్ కేంద్రాలు, ఎగుమతి సదుపాయాలు ఏర్పాటు చేయాలి.– "నల్గొండ బత్తాయి పునరుజ్జీవన మిషన్" పేరుతో ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను ప్రభుత్వం ప్రకటించాలి.బత్తాయిని కాపాడటం... తెలంగాణ ఉద్యాన రంగాన్ని కాపాడటమేనల్గొండలో బత్తాయి సాగు క్షీణించడం అంటే కేవలం ఒక పంట తగ్గిపోవడం కాదు. అది వేలాది రైతు కుటుంబాల జీవనాధారం కోల్పోవడం, లక్షలాది వ్యవసాయ కార్మికుల ఉపాధి దెబ్బతినడం, ఒక ప్రాంత గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలహీనపడడం.ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి బత్తాయి రైతుకు మార్కెట్ భరోసా, గిట్టుబాటు ధర, శాస్త్రీయ సహాయం, ఆర్థిక రక్షణ కల్పించాలి. రైతు పండించిన పంటకు గౌరవప్రదమైన ధర దక్కినప్పుడే వ్యవసాయానికి భవిష్యత్తు ఉంటుంది.నల్గొండ బత్తాయిని కాపాడటం అంటే ఒక పంటను కాపాడటం కాదు... వేలాది రైతు కుటుంబాల భవిష్యత్తును, ఒక ప్రాంత ఆర్థిక వ్యవస్థను, తెలంగాణ ఉద్యాన రంగ అస్థిత్వాన్ని కాపాడటమే.జి. అజయ్ కుమార్



## జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు వెంటనే ఇవ్వాలి... లేదంటే రాష్ట్రవ్యాప్త ఉద్యమం తప్పదు: టీయూడబ్ల్యూజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆస్కాని మారుతి సాగర్



వికారాబాద్, జూలై 31జర్నలిస్టుల సంక్షేమం, ముఖ్యంగా ఇళ్ల స్థలాల సాధన కోసం తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఖఔజీ–ఐ143) ఆధ్వర్యంలో నిరంతరం పోరాటం కొనసాగిస్తామని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆస్కాని మారుతి సాగర్ స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టులకు ఇచ్చిన హామీలన్నింటినీ తక్షణమే అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.ఈరోజు వికారాబాద్ జిల్లా కేంద్రంలో టీయూడబ్ల్యూజే జిల్లా అడహాక్ కమిటీ కన్వీనర్ ఆసీఫ్ హుస్సేన్ ఆధ్వర్యంలో జిల్లా సన్నాహక సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశానికి వికారాబాద్, కోడంగల్, పరిగి, తాండూర్ డివిజన్ల నుంచి పెద్ద సంఖ్యలో జర్నలిస్టులు హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆస్కాని మారుతి సాగర్ మాట్లాడుతూ, వికారాబాద్ జిల్లాలో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల కేటాయింపును ప్రభుత్వం అత్యవసరంగా చేపట్టాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి అవలంబించడం విచారకరమని పేర్కొన్నారు. జర్నలిస్టుల సంక్షేమానికి సంబంధించిన హామీలను వెంటనే అమలు చేయాలని, లేనిపక్షంలో టీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలను ఉద్ధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు.అనంతరం జరిగిన సమావేశంలో టీయూడబ్ల్యూజే సంస్థ బలోపేతం, సభ్యత్వ విస్తరణ, జర్నలిస్టుల సంక్షేమం, హక్కుల పరిరక్షణ, జిల్లా వ్యాప్తంగా మండల మరియు డివిజన్ స్థాయి కమిటీల ఏర్పాటు వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు.ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే రాష్ట్ర కోశాధికారి యేగానంద్, జాతీయ కౌన్సిల్ సభ్యుడు తిరుపతి నాయక్, జిల్లా నాయకులు రవీందర్, ఆసీఫ్ హుస్సేన్, ప్రహ్లాదాచారి, శ్రీనివాస్, నర్సిములు, ఆనంద్, జావీద్, రాజు, బస్వరాజ్, సంతోష్, మల్కయ్య గౌడ్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.వికారాబాద్ జిల్లా టీయూడబ్ల్యూజే నూతన అడహాక్ కమిటీ ఏకగ్రీవ ఎన్నికఈ సమావేశంలో తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ 143) వికారాబాద్ జిల్లా నూతన అడహాక్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.జిల్లా కన్వీనర్‌గా:ఎం. రవీందర్కో-కన్వీనర్లుగా:ప్రహ్లాదాచారి, శ్రీనివాస్, నర్సిములు, ఆనంద్, జావీద్, రాజు, బస్వరాజ్, సంతోష్, మల్కయ్య గౌడ్, కృష్ణ, రాజేందర్ గౌడ్లను జిల్లా జర్నలిస్టులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.నూతన కమిటీ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా టీయూడబ్ల్యూజేను మరింత బలోపేతం చేయడంతో పాటు జర్నలిస్టుల సమస్యల పరిష్కారం, సభ్యత్వ విస్తరణ, సంక్షేమ కార్యక్రమాల అమలుకు కృషి చేయాలని సమావేశం నిర్ణయించింది.

## లేతమామిళ్ల వాగు కల్వర్టును పరిశీలించిన కాంగ్రెస్ నాయకులు.



ఎల్లారెడ్డిపేట ఎల్లారెడ్డిపేట మండలం అక్కపల్లి గ్రామానికి వెళ్లే మార్గంలో ఉన్న లాతమామిళ్ల వాగుపై నిర్మించిన కల్వర్టును శుక్రవారం ఎల్లారెడ్డిపేట మండల కాంగ్రెస్ నాయకులు, అక్కపల్లి గ్రామ కాంగ్రెస్ నాయకులు కలిసి పరిశీలించారు. వర్షాకాలంలో ఈ కల్వర్టు ద్వారా రాకపోకలకు ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉన్నందున, ప్రజల సౌకర్యార్థం ఇక్కడ వెంటనే శాశ్వత వంతెన (బ్రిడ్జి) నిర్మించాలని నాయకులు ప్రభుత్వాన్ని కోరారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సుదిరి రాజేందర్ మాట్లాడుతూ, అక్కపల్లి గ్రామ ప్రజలకు భద్రమైన రవాణా సౌకర్యం కల్పించేందుకు వంతెన నిర్మాణం అత్యవసరమని పేర్కొన్నారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నరసయ్య కూడా ప్రజా సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉంటుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ గుండాడి రామ్‌రెడ్డి, గౌస్ పాషా, అక్కపల్లి గ్రామ శాఖ అధ్యక్షుడు జంగా భూమ్‌రెడ్డి, లచ్చిరెడ్డి, మాదాసు బాబు తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## ఆధునిక సౌకర్యాలతో స్వస్తిక్ డిజిటల్ స్టూడియో



హయత్‌నగర్ జులై 31హయత్‌నగర్‌లో ఆధునిక సౌకర్యాలతో ఏర్పాటు చేసిన స్వస్తిక్ డిజిటల్ కలర్ ల్యాబ్ అండ్ స్టూడియోను శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. హయత్‌నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై స్టూడియోను ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు. వేగవంతమైన, నాణ్యమైన సేవలను అందించేందుకు స్వస్తిక్ డిజిటల్ స్టూడియో కృషి చేయడం అభినందనీయమన్నారు.స్టూడియో నిర్వాహకుడు సామ మహేందర్ రెడ్డి మాట్లాడుతూ.. పాస్‌పోర్ట్ ఫొటోలు, ఫొటో ఫ్రేమింగ్, ఆల్బమ్ డిజైనింగ్, లామినేషన్ తదితర సేవలను నాణ్యతతో పాటు సరసమైన ధరలకు అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. వినియోగదారులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యమన్నారు.కార్యక్రమంలో బండారి భాస్కర్, సత్తార్ పాషా, అశోక్ యాదవ్, భీమ్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, శేఖర్ రెడ్డి, అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి వినోద్ కన్నా, కోశాధికారి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## దేవరకొండ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాలు ఉద్యోగ విరమణ సందర్బంగా సన్మానం



దేవరకొండ బాలుర ఉన్నత పాఠశాల గజిటెడ్ ప్రధానోపాధ్యాయులు చేరిపల్లి శ్రీనివాసులు గారి పదవీ విరమణ సన్మాన మహోత్సవం సందర్భంగా వారిని దేవరకొండ ప్రభుత్వ పెన్షనర్స్ సంఘం బాధ్యులు తాడిశెట్టి నరసింహ అధ్యక్షులు, అంకం చంద్రమౌళి కార్యదర్శి,అధ్యక్షులు గంగిడి దామోదర్ రెడ్డి సహ అధ్యక్షులు, వనం బుచ్చయ్య సంయుక్త కార్యదర్శి,కంచర్ల నారాయణ రెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు, మహమ్మద్ యూసుఫ్ షరీఫ్ కార్యనిర్వాహక కార్యదర్శి గారలు మరియు సభ్యులు ఆత్మీయ సన్మానం చేసి వారిని పెన్షనర్స్ సంఘానికి ఆహ్వానం పలికినారు.మీ సేవలు ఇక ముందు పెన్షనర్స్ సంఘానికి అందజేయవలసినదిగా కోరినారు.పాఠశాల సిబంది ప్రధానోపాధ్యాయులు వారి సేవలను కొనియాడినారు.

## ఖాళీల భర్తీ ఉద్యోగ హక్కు కోసం యువత సంగటితం కావాలి.




,దిండి, జులై 31 ,నిరుద్యోగ యువత జీవితాలతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చెలగాటమాడుతున్నాయని, దేశవ్యాప్తంగా ఉన్న ఉద్యోగ ఖాళీల భర్తీ ,ఉద్యోగ హక్కు కోసం యువత సంగటితం కావాలని అఖిల భారత యువజన సమాఖ్య తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర అన్నారు.ఏఐవైఎఫ్ దిండి మండల 15వ మహాసభ స్థానిక ఎలకుర్తి జైపాల్ గార్డెన్స్ లో శుక్రవారం నిర్వహించారు.జిల్లా ఉపాధ్యక్షులు యనమల నవీన్ అధ్యక్షతన జరిగిన ఈ మహాసభల కు ధర్మేంద్ర ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు .దేశంలో నిరుద్యోగం రోజురోజుకు పెరుగుతున్న కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు శాశ్వత ఉద్యోగాల భర్తీపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయి.ప్రభుత్వ శాఖల్లో భారీ సంఖ్యలో ఖాళీలు ఉన్నప్పటికీ, నియామకాలు సకాలంలో కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.మరోవైపు ప్రైవేటీకరణ కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్ విధానాల వల్ల శాశ్వత ఉద్యోగుల అవకాశాలు తగ్గి యువత భవిష్యత్తు కష్టార్గంగా మారిందన్నారు .ఏఐవైఎఫ్ నల్గొండ జిల్లా కార్యదర్శి తిరుపారి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ,సమస్యల పరిష్కారం కోసం యువత సంగటితమై ఉద్యమించాల్సిన అవసరం ఉందని అన్నారు .సెప్టెంబర్ 8 ,9 ,10 తేదీలలో యాదగిరిగుట్టలో జరిగే ఏఐవైఎఫ్ తెలంగాణ రాష్ట్ర మూడవ మహాసభల్లో ఉపాధి, విద్యా, వైద్యం ప్రభుత్వ ఖాళీలు ,భర్తీ యువత హక్కుల విశాలపై తీర్మానాలు చేసి ,భవిష్యత్ పోరాట కార్యక్రమం చేస్తామని అన్నారు.ఈ మహాసభలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తూము బుచ్చిరెడ్డి ,జిల్లా రైతు సంఘం అధ్యక్షులు ఎండి మైనుద్దీన్ ,మండల కార్యదర్శి శ్రీ రామదాసు కనకాచారి ,సహాయ కార్యదర్శి విజయేందర్ రెడ్డి, శైలేష్ ,రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ప్రేమ్ కుమార్, కొంపల్లి కళ్యాణ్ ,ఉదయ్, వినయ్, ఎలిమినేటి నరేష్, వందమంది కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల సేవలు సమాజానికి ఆదర్శం.ఎమ్మెల్యే బాలు నాయక్ .



దేవరకొండ డివిజన్, జూలై 31 ,విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే ఉపాధ్యాయుల సేవలు సమాజానికి ఆదర్శప్రాయం అని, దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు .దేవరకొండ జడ్పీ హైస్కూల్ (బాయ్స్) పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా పనిచేసే పదవీ విరమణ పొందిన చేరిపెల్లి శ్రీనివాసులు సన్మాన కార్యక్రమములో ఆయన పాల్గొని మాట్లాడారు.విద్యార్థులకు విద్యాబోధన చేసి వారి జీవితాలను తీర్చిదిద్దడంలో శ్రీనివాసులు విశేష కృషి చేశారని ఎమ్మెల్యే కొనియాడారు .ఉపాధ్యాయ వృత్తి ఉద్యోగం మాత్రమే కాకుండా భావితరాలను నిర్మించే బాధ్యత అని పేర్కొన్నారు .ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి విద్యా ప్రమాణాల పెంపుకు, ఉపాధ్యాయుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తుందని గుర్తు చేశారు.ప్రభుత్వ విద్యను మరింత బలోపేతం చేయడానికి ప్రభుత్వం అనేక కార్యక్రమాలు అమలు చేస్తుందన్నారు .ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పున్న శైలజ వెంకటేశ్వర్లు ,మాజీ చైర్మన్ ఆలంపల్లి నరసింహ, దేవరకొండ చేనేత సహకార సంఘం అధ్యక్షులు చేరిపల్లి బాలరాజు, రిటైర్డ్ సంఘం అధ్యక్ష కార్యదర్శులు తాడిశెట్టి నరసింహ, అంకం చంద్రమౌళి, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ,పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## నిర్మాణ భవనం పైనుంచి పడ్డ ఇటుకతో గాయపడి ఐదేళ్లుగా మంచానికే పరిమితమైన మహిళ మృతి.

ఎల్లారెడ్డిపేటలో విషాదం . భవన యజమానిపై చర్యలకు డిమాండ్.



ఎల్లారెడ్డిపేట, ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో విషాద ఘటన చోటుచేసుకుంది. ఐదేళ్ల క్రితం మండల కేంద్రంలో ఓ అధికారి చేపట్టిన మూడంతస్తుల భవనం నిర్మాణ సమయంలో పై అంతస్తు నుండి పడిన ఇటుక మహిళ తలపై పడటంతో తీవ్రంగా గాయపడిన మహిళ గురువారం రాత్రి మృతి చెందింది.స్థానికుల కథనం ప్రకారం, ఎల్లారెడ్డిపేటకు చెందిన ఉప్పుల నర్సవ్వ తన ఇంటి వద్ద వంట పాత్రలు శుభ్రం చేస్తుండగా పక్కనే నిర్మాణంలో ఉన్న భవనం పైభాగం నుండి ఇటుక పడింది. ఈ ప్రమాదంలో ఆమె తలకు తీవ్ర గాయమై అప్పటి నుండి అనారోగ్యంతో మంచానికే పరిమితమయ్యారని కుటుంబ సభ్యులు తెలిపారు. ఐదేళ్లుగా మంచం పట్టిన నర్సవ్వ గురువారం రాత్రి కన్నుమూసింది.నర్సవ్వ మృతితో కుటుంబ సభ్యులు, బంధువులు శోకసంద్రంలో మునిగిపోయారు. గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.ఈ ప్రమాదానికి భవన నిర్మాణం చేపట్టిన యజమాని తగిన రక్షణ చర్యలు తీసుకోకపోవడమే కారణమని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. నిర్మాణ పనుల సమయంలో భద్రతా ప్రమాణాలు పాటించి ఉంటే ఈ ప్రమాదం జరిగేది కాదని వారు పేర్కొన్నారు.తలకు గాయమై ఐదేళ్ల పాటు మంచానికే పరిమితమై చివరకు మృతి చెందిన నర్సవ్వకు న్యాయం చేయాలని బంధువులు, గ్రామస్థులు కోరుతున్నారు. ఘటనపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, మృతురాలి కుటుంబానికి తగిన న్యాయం జరిగేలా చూడాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

## మార్కెట్ యార్డును పరిశీలించిన వెటర్నరీ జాయింట్ డైరెక్టర్

గూడూరు -:చిల్లకూరు మండల పరిధిలోని ముత్యాలపాడు వద్ద ఉన్న మార్కెట్ యార్డ్ లో ప్రతి శు



క్రవారం జీవాల సంతను నిర్వహిస్తుంటారు.శుక్రవారం మార్కెట్ యార్డు ను వెటర్నరీ జె.డి. రమేష్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవాలు దాహార్తి తీర్చేందుకు 9 నీటి తొట్టెలను ఏర్పాటు చేశామన్నారు.అదేవిధంగా వ్యాపారస్తులు, రైతుల కొరకు త్రాగునీటికి ఇబ్బందులు లేకుండా ఆర్వో ప్లాంట్ ను ఏర్పాటు చేశామన్నారు . ఇప్పటికే 14 మరుగుదొడ్లను ఏర్పాటు చేశామన్నారు . పాలక మండలి తో చర్చించి అదనంగా పది మరుగుదొడ్లను ఏర్పాటు చేస్తామన్నారు. క్రయ విక్రయాలు జరుగుతున్న ఒక్కొక్కజీవానికి మార్కెట్ కమిటీ నియమ నిబంధనలు మేరకే 50 రూపాయలు వసూలు చేస్తున్నారని, ఆన్లైన్ పర్మిట్ల కారణంగా ఎటువంటి అవకతవకలు జరిగే ఆస్కారం లేదన్నారు. 2018 - 19 సంవత్సరంలో షెల్టర్ కొరకు రెండు షెడ్లకు 92 లక్షలు మంజూరు చేయడం జరిగిందన్నారు. ఇప్పటి వరకు కాంట్రాక్టర్ 39.60 లక్షలు ఖర్చు పెట్టి పిల్లర్స్ వరకు నిర్మాణం జరిపి షెడ్ల పై కప్పు లను షీట్స్ తో అమర్చి అసంపూర్తిగా ఉందని, త్వరలోనే పాలక వర్గం దృష్టికి తీసుకు వెళ్లి ప్రతిపాదనలు తయారు చేసి, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్లి షెడ్లను వినియోగంలోకి తీసుకువస్తామన్నారు. ఈయన వెంట ఏడి మార్కెటింగ్ అనిత, సెక్రెటరీ జగదీష్ బాబు, అసిస్టెంట్ డైరెక్టర్ , వెటర్నరీ డాక్టర్ సుబ్రహ్మణ్యం , పట్టాభి రెడ్డి , తదితరులు ఉన్నారు.

### అవిష్కరణలకు ఆహ్వానం..

### జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్--2026కు ఉపాధ్యాయులకు శిక్షణ

ధర్మవరం, జులై 31;విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసి, సమాజానికి ఉపయోగపడే



శాస్త్రీయ ఆవిష్కరణలను ప్రోత్సహించే లక్ష్యంతో శ్రీ సత్యసాయి జిల్లా జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్--2026 నిర్వహణకు సంబంధించి శుక్రవారం ధర్మవరం కొత్తపేట మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాలలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఉన్నత పాఠశాలల నుంచి ఒక్కో సైన్స్ ఉపాధ్యాయుడు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ధర్మవరం, తాడిమర్రి, బత్తలపల్లి, రామగిరి, కనగానపల్లి, సీకేపల్లి, కొత్తచెరువు, పుట్టపర్తి, బుక్కపట్నం మండలాలకు చెందిన ఉపాధ్యాయులకు జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్--2026 విద్యార్థుల నమోదు విధానం, సైన్స్ ఇన్నోవేషన్‌లు, సృజనాత్మక ఆవిష్కరణల రూపకల్పన, ప్రాజెక్టుల తయారీ తదితర అంశాలపై రిసోర్స్ పర్సన్స్ అనిల్, నాగరాజు శిక్షణ అందించారు.ఈ కార్యక్రమాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాంప్రసాద్, ఎన్‌సీఎస్‌సీ జిల్లా అకాడమీ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు పర్యవేక్షించారు. విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించి, వినూత్న ఆలోచనలను జాతీయ స్థాయికి తీసుకెళ్లేందుకు ఈ శిక్షణ ఉపయోగపడుతుందని తెలిపారు.

## నేతన్న సేవ సర్వే గడువు పొడిగించాలి



ధర్మవరం, జులై 31; నేతన్న సేవ పథకం కింద లబ్ధిదారుల ఎంపిక కోసం నిర్వహిస్తున్న సర్వే గడువును వెంటనే పొడిగించాలని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు శుక్రవారం ధర్మవరంలోని సంఘం కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో జిల్లా కన్వీనర్ జె.వి. రమణ, జిల్లా నాయకులు ఎస్.హెచ్. బాషా, ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జంగాలపల్లి పెద్దన్న మాట్లాడారు.నేతన్న సేవ పథకం ద్వారా చేనేత కార్మికులకు రూ.25 వేల ఆర్థిక సాయం అందించనున్న నేపథ్యంలో కేవలం ఒకే రోజు సర్వే నిర్వహించి లబ్ధిదారులను ఎంపిక చేయడం వల్ల అనేక మంది అర్హులైన చేనేత కార్మికులు నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. అలాగే 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ప్రయోజనం కూడా అనేక మంది చేనేత కార్మికులకు అందడం లేదని పేర్కొన్నారు.అందువల్ల సర్వే గడువును పెంచి, అర్హులైన ప్రతి చేనేత కార్మికునికి నేతన్న సేవ పథకం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వర్తించేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. లేకపోతే నష్టపోయిన చేనేత కార్మికులతో కలిసి జిల్లా వ్యాప్తంగా పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.ఈ సమావేశంలో చేనేత సంఘం పట్టణ అధ్యక్షుడు ఏ. ఖాదర్‌బాషా, కార్యదర్శి గుంపు హరి, నాయకులు వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

## డీఎస్సీ అక్రమాలపై సీబీఐ విచారణ జరపాలి



ధర్మవరం, జులై 31; : డీఎస్సీ--2025లో జరిగిన అక్రమాలపై సీబీఐతో విచారణ జరిపించాలని, నిరుద్యోగ యువతకు నెలకు రూ.3,000 నిరుద్యోగ భృతి అందించాలని, విద్యా దీవెన, వసతి దీవెన బకాయిలను వెంటనే విడుదల చేయాలని, అలాగే డీఎస్సీ ప్రశ్నపత్రం లీకేజీకి నైతిక బాధ్యత వహిస్తూ మంత్రి నారా లోకేష్ తన పదవికి రాజీనామా చేయాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు.ఈ మేరకు శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి, పుట్టపర్తి మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి, హిందూపురం పార్లమెంట్ అబ్జర్వర్ రమేష్ రెడ్డి, మడకశిర నియోజకవర్గ సమన్వయకర్త లక్కప్పతో పాటు వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

## ఆదివారం ఉచిత వైద్య శిబిరం



ధర్మవరం, జులై 31; స్పందన హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకు ధర్మవరంలోని కొత్తపేట రైల్వే స్టేషన్ సర్కిల్ సమీపంలోని ఉషోదయ స్కూల్ వద్ద ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు డాక్టర్ సోనియా తెలిపారు.శిబిరంలో ఉచితంగా షుగర్, రక్తపోటు (బీపీ) పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

## అయిజ తహసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించిన లోక్ అదాలత్ అధికారులు .



(శివసూర్య )గతంలో అయిజ పట్టణానికి చెందిన, సామజిక కార్యకర్త సి.ఆంజనేయులు లోక అదాలత్ లో ఫిర్యాదు చేసిన (ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం) గురించి విచారణ చేపట్టేందుకు లోక్ అదాలత్ ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్ రమణమూర్తి ,డిప్యూటీ డైరెక్టర్ లు ఇస్మాయిల్ ,జైపాల్ వచ్చారు .అన్యాక్రాంతమైన 936 సర్వేనెంబర్ గల ప్రభుత్వ భూమిని పరిశీలించారు. నిబంధనలకు విరుద్ధంగా కబ్జాలో ఉన్న నిర్మాణాలను తొలగించాలని, ప్రభుత్వ భూమి చుట్టూ కంచవేసి బోర్డు పెట్టాలని లోక్ అదాలత్ ఆదేశాలు ఉన్నాయని తెలిపారు. పరిశీలించిన వివరాల నివేదికను సంబంధిత అధికారులకు అందజేస్తామని అధికారులు తెలిపారు . కార్యక్రమంలో తాసిల్దార్ జ్యోతి ఆర్ ఐ రజనీకాంత్ రెడ్డి పాల్గొన్నారు.

## పోలీసుల అదుపులో పేకాట రాయుళ్లు.



గట్టు (శివసూర్య ) జోగుళాంబ గద్వాల జిల్లా గట్టు మండల పరిధిలోని బోయలగూడెం శివారులో శుక్రవారం సాయంత్రం అక్రమంగా పేకాట ఆడుతున్న వారిపై దాడి నిర్వహించి, మొత్తం 08 మందిని అదుపులోకి తీసుకున్నామని,వారి వద్ద నుండి 06 మొబైల్ ఫోన్లు, 9 మోటార్ సైకిళ్లు మరియు ?44,110 నగదును స్వాధీనం చేసుకున్నామని,గట్టు ఎస్ఐ శేఖర్ గౌడ్ మీడియాకు తెలిపారు.

Printed, Polished, Owned by BESTHA SHIVA RAMUDU & Printed UTTEJITA PRINTERS H.NO -801, BUDHAWAR PETA, KURNOOL, ANDHRA PRADESH - 518001. APTEL2023/88704 & Published at D.No.4-458, PAIGEAR, NANDAVARAM, V&P. KURNOOLD.T. (A.P)-518343,CELL:9494741301.